210 స్థానాల్లో గెలుస్తాం

సర్వసభ్యమండలిలో ఈపీఎస్ ధీమా



సర్వసభ్యమండలి సమావేశంలో ప్రసంగిస్తున్న ఎడప్పాడి పళనిస్వామి



సభకు హాజరైన సర్వసభ్యమండలి, కార్యనిర్వాహక మండలి సభ్యులు

చెన్నై, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వచ్చే యేడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే కూటమి 210 స్థానాలలో ఘనవిజయం సాధిస్తుందని, సొంత మెజారిటీతోనే తాము అధికారంలోకి వస్తామని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి (ఈపీఎస్) ధీమా వ్యక్తం చేశారు. అన్నాడీఎంకే సర్వసభ్య మండలి, కార్యనిర్వాహక మండలి సమావేశం వానగరం శ్రీవారు వేంకటాచలపతి హాలులో బుధవారం జరిగింది. పార్టీ ప్రధాన కార్యదర్శి ఈపీఎస్, మాజీ మంత్రులు, పార్టీ సీనియర్ నేతలు పాల్గొన్నారు. ఈ సమావేశానికి అనారోగ్యం, వృద్ధాప్య సమస్యల కారణంగా పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు తమిళ్‌మగన్ హుసేన్ హాజరు కాలేకపోయారు. దీంతో పార్టీ తాత్కాలిక వ్యవస్థాపక అధ్యక్షుడిగా మాజీ మంత్రి కేపీ మునుసామి సమావేశానికి అధ్యక్షత వహించారు. సర్వసభ్య మండలికి చెందిన 3 వేల మంది సభ్యులు, కార్యనిర్వాహక మండలి సభ్యులు, ప్రత్యేక ఆహ్వానితులు సహా మొత్తం 5 వేలమంది హాజరయ్యారు. ఈ సమావేశంలో 16 కీలకమైన తీర్మానాలు ప్రతిపాదించారు. అదే సమయంలో కూటమిలో ఇతర పార్టీలను చేర్చుకునే బాధ్యతను ప్రధాన కార్యదర్శి ఈపీఎస్‌కు అప్పగిస్తూ సర్వసభ్య మండలి సభ్యులంతా తీర్మానం చేసి ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో ఈపీఎస్ మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో అన్నాడీఎంకే విజయాన్ని అడ్డుకోవడం ఎవరి తరం కాదని ప్రకటించారు. అన్నాడీఎంకేలో ఎన్ని ఆటుపోట్లు, అడ్డంకులు ఎదురైనా, ప్రత్యర్థులు పార్టీని అంతమొనర్చాలని కుట్రలు పన్నినా వాటినన్నింటిని అధిగమించి పార్టీని అభివృద్ధి పరచిన జయలలిత సేవలు చిరస్మరణీయమన్నారు. ప్రసార మాధ్యమాలు పనిగట్టుకుని అన్నాడీఎంకేపైనే విమర్శలు చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

డీఎంకేకు ఓటమి భయం...

రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రజాదరణ, ప్రత్యేకించి యువత మద్దతు పూర్తిగా కోల్పోయారని, అందువల్లే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి తప్పదని డీఎంకే నేతలంతా భయపడుతున్నారని ఈపీఎస్ ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోతామన్న భయంతోనే ఇప్పటికిప్పుడు విద్యార్థులకు లాప్‌టాప్‌లను పంపిణీ పథకాన్ని అమలు చేయడానికి స్టాలిన్ సిద్ధమయ్యారని తెలిపారు.

పొంగల్‌కు రూ.5వేలు ఇవ్వండి...

వచ్చే యేడాది సంక్రాంతికి రేషన్‌కార్డుదారులందరికీ తలా రూ.5వేల నగదు , ఉచితంగా కిరాణా సరకులను అందజేయాలని అన్నాడీఎంకే తరఫున డీఎంకే ప్రభుత్వాన్ని తాను డిమాండ్ చేస్తున్నానని ఈపీఎస్ పేర్కొన్నారు. ప్రస్తుతం అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో మరో 30 లక్షలమంది గృహిణులకు ఆ పథకాన్ని అమలు చేయడానికి సిద్ధమవుతోందని ఈపీఎస్ అన్నారు.

ఎన్నికల తర్వాత స్టాలిన్ పలాయనం...

అన్నాడీఎంకేలో ఎంజీఆర్, జయలలిత తర్వాత పార్టీపై పెత్తనం చెలాయించే వారసులు ఎవరూ లేరని, అయినా పార్టీ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ముందుకు దూసుకెళుతోందని పళనిస్వామి అన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రిగా తాను పదవి చేపట్టినప్పుడు శాసనసభలో విశ్వాసతీర్మానం ప్రవేశపెట్టిన సమయంలో ప్రతిపక్షనేత స్టాలిన్, డీఎంకే సభ్యులంతా కలిసి స్పీకర్ పోడియం చుట్టుముట్టి గలాభా సృష్టించారని, ఆ తర్వాత స్టాలిన్ తనకు తానుగా చొక్కా చింపుకుని అసెంబ్లీ నుండి బయటకు వెళ్ళారని విమర్శించారు. వచ్చే యేడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో అన్నాడీఎంకే గెలిచి అధికారంలోకి రాగనే స్టాలిన్ మళ్ళీ చొక్కా చింపుకుని పలాయనం చిత్తగించడం ఖాయమని ఎద్దేవా చేశారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 2లక్షల ఓట్ల తేడాతోనే 43 శాసనసభ నియోజకవర్గాల్లో గెలవలేక అధికారాన్ని కోల్పోయామని చెప్పారు.

అమిత్‌షాలకు భయపడం

బూత్‌కమిటీ ఇన్‌ఛార్జుల సమావేశంలో స్టాలిన్



సమావేశంలో స్టాలిన్

చెన్నై, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ ఎన్నికల్లో అడ్డదారుల్లో గెలిచేందుకు రాష్ట్రానికి ఎంతమంది అమిత్‌షాలు వచ్చినా భయపడే ప్రసక్తే లేదని, బూత్ కమిటీ ఇన్‌చార్జులు డీఎంకే విజయమే లక్ష్యంగా పనిచేయాలని ఆ పార్టీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పిలుపునిచ్చారు. బుధవారం ఉదయం ఆళ్వార్‌పేట పోలింగ్ కేంద్రం ఇన్‌ఛార్జులతో స్టాలిన్ సమావేశమయ్యారు. పార్టీ స్థానిక నాయకులు అన్బగమ్ కళై, నందనం మది, ప్రిసీడియం చైర్మన్ రాజేంద్రన్ తదితరులు పాల్గొన్నారు. స్టాలిన్ మాట్లాడుతూ.. ఢిల్లీ పాదుషాలనే గర్వంతో రాష్ట్రానికి వస్తే అమిత్‌షాకు ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ నలుపు, ఎరుపు బ్యాడ్జీలు ధరించిన పార్టీ ఇన్‌చార్జులు తగిన గుణపాఠం చెబుతారన్నారు. రాష్ట్ర శ్రేయస్సు పట్టించుకోకుండా విర్రవీగే కేంద్రానికి తమిళనాడు ఎల్లప్పుడు అవుటాఫ్ కంట్రోల్ అని స్టాలిన్ గట్టిగా చెప్పారు. డీఎంకేకు, మిత్రపక్షాలకు తప్పకుండా ఓటు వేసేవారిని పోలింగ్ కేంద్రాలకు రప్పించే బాధ్యత పోలింగ్ బూత్ ఇన్‌చార్జులపై ఉందన్నారు. ఈ ఎన్నికల్లో ప్రత్యర్థులు పనిగట్టుకుని డీఎంకేకు ఓటువేసే వారిని పోలింగ్ కేంద్రానికి రానీయకుండా అడ్డుకునేందుకు కూడా కుట్రలు పన్నుతారని, ఈ విషయంలో బూత్ కమిటీ ఇన్‌చార్జులు అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి మళ్ళీ అధికారంలోకి వస్తామనే నమ్మకం పార్టీ శ్రేణులందరికీ ఉన్నా, అప్రమత్తంగా వ్యవహరించకపోతే గెలుపునకు దూరమయ్యే ప్రమాదం కూడా పొంచివుందని స్టాలిన్ హెచ్చరించారు.

విజయ్‌వన్నీ అబద్ధాలే

పుదువై మంత్రి నమశ్శివాయం



పుదుచ్చేరి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే)అధ్యక్షుడు విజయ్ చెప్పేవన్నీ అబాద్ధాలేనని పుదుచ్చేరి హోం శాఖ మంత్రి నమశ్శివాయం స్పష్టం చేశారు. పుదుచ్చేరిలో మంగళవారం జరిగిన సభలో పుదుచ్చేరికి రాష్ట్రహోదా కల్పించకుండా కేంద్రప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని, ఆ రాష్ట్ర అభివృద్ధిని ఏ మాత్రం పట్టించుకోలేదని విజయ్ విమర్శించారు. వీటిపై స్పందించిన మంత్రి నమశ్శివాయం బుధవారం మీడియాతో మాట్లాడుతూ, కేంద్రపాలిత రాష్ట్రమైన పుదుచ్చేరిలో ప్రభుత్వ నిర్వహణ ఎలా సాగుతుందో తెలుసుకోకుండా విజయ్ ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్ వేదికపై చదివారని, అందులో 90శాతం వరకు అసత్యాలేనన్నారు. రాజకీయ వేదికలపై ప్రజలను ఆకట్టుకోవాలంటే భవిష్యత్తు ప్రణాళికపై సొంతంగా ఆలోచించి మాట్లాడాలని, అయితే రాజకీయ పరిజ్ఞానంలేని విజయ్ ప్రజలను తప్పుదారిపట్టించేలా మాట్లాడడం ఖండించదగ్గదన్నారు. తమిళనాడులో ఆయనకు బహిరంగ సభలు జరుపుకునేందుకు అనుమతించడంలేదని, అక్కడ స్వేచ్ఛ కోల్పోయిన విజయ్ తమ రాష్ట్రంలో నోటికొచ్చినట్లు మాట్లాడారని, ఆయన 12 నిమిషాల ప్రసంగాన్ని ప్రజలు పట్టించుకోలేదన్నారు. గత పార్లమెంట్ ఎన్నికల ముందు పుదుచ్చేరిలోని రేషన్‌దుకాణాల్లో బియ్యానికి బదులుగా ప్రజలకు నగదు పంపిణీ జరిగిందని, ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్రప్రభుత్వ అనుమతితో ఉచిత బియ్యం పంపిణీ పథకం విజయవంతంగా అమలు జరుగుతోందని, దీని గురించి తెలుసుకోకుండా విజయ్ చెప్పిన మాటలను తమ రాష్ట్రప్రజలు నమ్మలేదన్నారు.

తమ రాష్ట్రప్రజలు రాజకీయాలను బాగా తెలుసుకున్నారని, ఇక్కడ ఏ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజలు సుభీక్షంగా ఉంటారో ఆలోచించి ఆ పార్టీకి అధికారాన్ని కట్టబెడుతారని తెలిపారు. 2026లో పుదుచ్చేరిలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో మళ్లీ ఎన్డీయే కూటమి ప్రభుత్వ ఏర్పాటవుతుందని, దీనిని అడ్డుకునే దమ్ము ఎవరికి లేదని మంత్రి నమశ్శివాయం అభిప్రాయపడ్డారు.

జనవరిలో రాష్ట్రానికి రాహుల్, ప్రియాంక

కాంగ్రెస్‌కు 21 స్థానాలు ఖరారు చేసిన డీఎంకే?



ప్యారీస్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వచ్చే నెల జరుగనున్న కాంగ్రెస్ పార్టీ రాష్ట్రస్థాయి గ్రామ కమిటీల మహానాడుకు తమ పార్టీ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ సహా సీనియర్లు పాల్గొంటారని టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుందగై తెలిపారు. గ్రామ కమిటీల మహానాడు నిర్వహించేందుకు వీలుగా పార్టీ అధిష్టానం ఆర్గనైజర్ల కమిటీలను నియమించిందని, ఇందులో ఫైనాన్స్ కమిటీకి కేవీ.తంగబాలు, ట్రాన్స్ పోర్ట్ కమిటీకి ఎస్.తిరునావుక్కరసన్, ఆహ్వాన కమిటీకి ఎస్.కృష్ణస్వామి, ప్రకటన కమిటీకి కేఎస్. అళగిరి, ప్రచార కమిటీకి పీటర్ అల్ఫోన్స్, మహానాడు వేదిక నిర్మాణం, వసతి కల్పించే కమిటీకి ఎమ్మెల్యే రూబీ మనోహరన్ నియమితులైనట్లు తెలిపారు. అలాగే ప్రియాంక గాంధీ పాల్గొననున్న మహిళా విభాగం ర్యాలీ నిర్వహణకు ఎంపీలు ఎస్.జ్యోతిమణి, సుధా రామకృష్ణన్, మాజీ ఎంపీ కె.రాణి, ఎమ్మెల్యే తారగై కత్బట్, మాజీ ఎమ్మెల్యే రాణి వెంకటేశన్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు హసీనా సయ్యద్ చేపడతారని ఆయన తెలిపారు.

కాంగ్రెస్‌కు 21 స్థానాలు?: వచ్చే ఏడాది జరుగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో తమ మిత్రపక్షమైన కాంగ్రెస్‌కు 21 స్థానాలు కేటాయించాలని డీఎంకే భావిస్తున్నట్లు తెలిసింది. వచ్చే నెల రాష్ట్రానికి రాహుల్ రానున్నందున..ఈ లోగా ఆ పార్టీకి సీట్లను ఖరారు చేయాలని డీఎంకే అధిష్ఠానం నిర్ణయించింది. ఆ మేరకు డీఎంకే అధ్యక్షుడు స్టాలిన్ ఒక నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం.

సీఎం కావాలనుకుంటున్న

విజయ్ కల ఫలించదు

మంత్రి కోవిచెళియన్


ప్యారీస్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాజకీయ అనుభవంలేని తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధ్యక్షుడు విజయ్ సీఎం కావాలనుకుంటున్న కల ఫలించదని రాష్ట్ర ఉన్నత విద్యాశాఖ మంత్రి కోవి చెళియన్ విమర్శించారు. తంజావూరు జిల్లా వరత్తనాడు సమీపంలోని నడువూరులో లక్ష మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ధాన్యం గోదాము నిర్మాణానికి రాష్ట్రప్రభుత్వం రూ.70.22కోట్లు కేటాయించింది. ఆ గోదాము శంకుస్థాపన ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా చేశారు నడువూరు నుంచి మంత్రి కోవీ.చెళియన్, మాజీమంత్రి ఎస్ఎస్.పళనిమాణిక్యం, జిల్లా కలెక్టర్ ప్రియాంక పంకజం, వ్యవసాయశాఖ అధికారులు హాజరయ్యారు. అనంతరం మంత్రి కోవి చెళియన్ మీడియాతో మాట్లాడుతూ, పుదుచ్చేరి రాష్ట్రంలో గత ఏడాది నుంచి రేషన్‌దుకాణాలు పనిచేస్తున్నాయని, అయితే టీవీకే అధ్యక్షుడు విజయ్ ఆ రాష్ట్రంలో రేషన్‌దుకాణాలే లేవని విమర్శించడం హాస్యాస్పదమన్నారు. రాజకీయ అనుభవం లేకుండానే ముఖ్యమంత్రి పీఠమెక్కాలని ఆశపడుతున్న విజయ్ కల నెరవేరదని, రాష్ట్రాన్ని పరిపాలించిన ముఖ్యమంత్రుల కృషి, చరిత్రను ఒక్కసారి ఆయన గుర్తుచేసుకోవాల్సి అవసరం ఉందని మంత్రి సూచించారు.



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి కోవి చెళియన్

రూ.750 విలువైన పొంగల్ కానుక

పుదుచ్చేరి సీఎం రంగస్వామి



పుదుచ్చేరి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరి వాసులకు ముఖ్యమంత్రి ఎన్ఆర్.రంగస్వామి తీపికబురు చెప్పారు. పొంగల్‌ను పురస్కరించుకుని జనవరి 3వ తేదీ నుంచి రూ.750 విలువైన కానుక పంపిణీ చేయనున్నట్లు ప్రకటించారు. పుదుచ్చేరిలో ఎన్నార్ కాంగ్రెస్ నేతృత్వంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వం కొనసాగుతోంది. తమిళనాడులో లాగే వచ్చే ఏడాది పుదుచ్చేరి అసెంబ్లీకి నిర్వహించే ఎన్నికలకు అక్కడ పార్టీలన్నీ సిద్ధమవుతున్నాయి. ఈ నేపథ్యంలో సీఎం రంగస్వామి బుధవారం అసెంబ్లీ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులు, గౌరవ రేషన్‌కార్డుదారులను మినహాయించి మిగతా రేషన్‌కార్డుదారులకు ప్రతి దీపావళి, పొంగల్ పండుగలను ప్రభుత్వం తరఫున కానుకల కిట్ అందజేస్తున్నట్లు తెలిపారు. గత దీపావళికి కూడా చక్కెర, మసాలా దినుసులు, సన్‌ఫ్లవర్ ఆయిల్ కిట్ పంపిణీ చేశామని, అదేవిధంగా 2026 జనవరిలో పొంగల్‌కు అర్హులైన వారికి 4 కిలోల పచ్చిబియ్యం, కిలో నాటు చక్కెర, కిలో పెసరపప్పు, 300గ్రాముల నెయ్యి, లీటర్ సన్‌ఫ్లవర్ ఆయిల్ ప్యాకెట్‌తో కూడిన కిట్ పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. ఈ పొంగల్ కానుక పుదుచ్చేరి, మాహే, యానాం, కారైక్కాల్ ప్రాంతాల్లోని రేషన్‌కార్డుదారులకు పంపిణీ చేయనున్నట్లు సీఎం ప్రకటించారు.

తిరుప్పరంకుండ్రంలో పురావస్తు అధికారుల పరిశీలన





పెరంబూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల వివాదానికి కారణమైన మదురై జిల్లా తిరుప్పరంకుండ్రం కొండపై వున్న దీపస్తంభాన్ని పురావస్తు శాఖ అధికారులు బుధవారం పరిశీలించారు. తిరుప్పరంకుండ్రం కొండపై ఉన్న దీపస్తంభంపై కార్తీక దీపం వెలిగించాలని కోరుతూ మదురైకి చెందిన రామరవికుమార్ హైకోర్టు మదురై బెంచ్‌లో పిటిషన్ వేశారు. ఈ కేసు విచారణకు రాగా, సంబంధిత ప్రాంతంలో సికిందర్ దర్గా ఉందని, దీపస్తంభానికి సమీపంలో దర్గా వున్నందున అక్కడ దీపం వెలిగిస్తే, శాంతి భద్రతల సమస్యలు తలెత్తుతాయని రాష్ట్ర ప్రభుత్వం తెలియజేసింది. ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయమూర్తి జీఆర్ స్వామినాథన్ గత నెల తిరుప్పరంకుండ్రం కొండపైకి వెళ్లి పరిశీలించారు. అనంతరం, కార్తీక దీపోత్సవం రోజున తిరుప్పరంకుండ్రంకొండపై ఉన్న దీపస్తంభంపై దీపం వెలిగించాలని ఆలయ అధికారులకు ఈ నెల 1వ తేది ఆదేశించగా, ఆయన ఉత్తర్వులు అమలు కాలే దు. దీంతో న్యాయస్థానం తీర్పు అమలుచేయని అధికారులపై చర్యలు చేపట్టాలని కోరుతూ పిటిషనర్ వేసిన కోర్టు ధిక్కరణ పిటిషన్‌ను అదే న్యాయమూర్తి సత్వరం విచారించారు. పిటిషనర్‌తో పాటు 10 మందిని దీపం వెలిగించేందుకు అనుమతించాలని, ఇందుకు పోలీసులు సహకరించనిపక్షంలో సీఐఎస్ఎఫ్ తగిన భద్రత కల్పించాలని ఆదేశించారు. ఆ మేరకు సీఐఎస్ఎఫ్ బలగాలతో పిటిషనర్ తిరుప్పరంకుండ్రం కొండ దగ్గరకు చేరుకున్నారు. అక్కడ మదురై పోలీసు కమిషనర్ లోకనాథన్ నేతృత్వంలోని పోలీసులు.. అక్కడ 144 సెక్షన్ అమలు చేయాలని మదురై కలెక్టర్ ఆదేశించారంటూ, వారిని కొండపైకి వెళ్లకుండా అడ్డుకోవడం వివాదాస్పదమైంది. ఈ వ్యవహారంపై మరుసటిరోజు దాఖలైన పిటిషన్‌పై విచారించిన న్యాయమూర్తి జీఆర్ స్వామినాథన్.. 4వ తేది రాత్రి 7 గంటలకు దీపం వెలిగించాలని, వారికి మదురై నగర పోలీసు కమిషనర్ భద్రత కల్పించడంతో పాటు 5వ తేది నేరుగా హాజరై నివేదిక అందజేయాలని ఉత్తర్వులు జారీచేశారు. ఆ ప్రకారం, దీపం వెలిగించేందుకు వెళ్లిన రామరవికుమార్‌ను పోలీసులు అడ్డుకున్నారు. 5వ తేది ఈ కేసు విచారణకు రాగా, హైకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో అప్పీలు పిటిషన్ వేసిందని పోలీసులు తెలిపారు. పోలీసుల వివరణను పరిగణనలోకి తీసుకున్న న్యాయమూర్తి.. కేసు విచారణ 9వ తేదీకి వాయిదావేశారు. కొండపై దీపం వెలిగించేందుకు వెళ్లిన రామరవికుమార్ బృందానికి భద్రత కల్పించాలంటూ ఇచ్చిన ఉత్తర్వులు ఎందుకు అమలుచేయలేదో సీఐఎస్ఎఫ్ కమాండోల నుంచి వివరణ తీసుకుని నివేదిక అందజేయాలని కేంద్రప్రభుత్వాన్ని న్యాయమూర్తి ఆదేశించారు. ఈ నేపథ్యంలో, తిరుప్పరంకుండ్రం కొండ శిఖరంపై ఉన్న దీపస్తంభాన్ని, పురావస్తు శాఖకు చెందిన ఏడుగురు బృందం వెళ్లి పరిశీలించింది. ఇది దీపం వెలిగించే స్తంభమా లేక మరేదైనానా? అంటూ పలు కోణాల్లో పరిశీలించిన ఈ బృందం.. కేసు విచారణకు అవసరమైన డేటా సేకరించినట్లు సమాచారం. ఈ స్తంభంపై దీపం వెలిగించాలనే కేసులో అప్పీలు పెండింగ్‌లో ఉన్నందున, ఈ పరిశోధన చేపట్టడం ముఖ్యమైనదిగా భావిస్తున్నారు.

సికిందర్ దర్గాకు బాంబు బెదిరింపు...

తిరుప్పరంకుండ్రం కొండపై ఉన్న సికిందర్ దర్గాకు బాంబు బెదిరింపు వచ్చింది. జిల్లా కలెక్టర్ కార్యాలయానికి వచ్చిన ఈ-మెయిల్‌లో సికిందర్ దర్గాలో బాంబు ఉంచినట్లు మెసేజ్ ఉంది. వెంటనే బాంబ్ స్క్వాడ్‌తో పోలీసులు బుధవారం దర్గా వద్దకు చేరుకుని క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడ ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేదని పోలీసులు తెలిపారు.

ముగియనున్న ఆరుగురు రాజ్యసభ సభ్యుల పదవీకాలం





ప్యారీస్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రానికి చెందిన ఆరుగురు రాజ్యసభ సభ్యుల పదవీకాలం 2026 ఏప్రిల్‌తో ముగియనుంది. ఇందువల్ల ఆ స్థానాలకు అసెంబ్లీ ఎన్నికల ముందే ఎన్నికలు నిర్వహించే అవకాశముంది. 2020, మార్చి నెలలో డీఎంకే తరుపున తిరుచ్చి శివ, అంధియూర్ సెల్వరాజ్, ఎన్నార్ ఇళంగో, కనిమొళి సోములు, అన్నాడీఎంకే తరుపున డాక్టర్ తంబిదురై, ఆ కూటమిలో ఉన్న తమిళ మానిల కాంగ్రెస్ అధ్యక్షుడు జీకే.వాసన్ రాజ్యసభ సభ్యులుగా బాధ్యతలు స్వీకరించారు. ఆరుగురి పదవీకాలం వచ్చే ఏడాది ఏప్రిల్ 1వ తేదీకి ముగియనుంది. అందువల్ల ఈ స్థానాలకు అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కాకముందే ఎన్నికల తేదీ ప్రకటించి ఏప్రిల్ 1లోగా ఎన్నికలు పూర్తిచేయనున్నట్లు కేంద్ర ఎన్నికల కమిషన్ తెలిపింది. ఈ స్థానాల్లో డీఎంకే తరుపున నలుగురు, అన్నాడీఎంకే తరుపున ఇద్దరిని ఎంపిక చేస్తారు. ఇందులో మళ్లీ రాజ్యసభ ఎంపీ పదవి ఎవరికి దక్కుతుందో త్వరలో స్పష్టం కానుంది.

అవయవమార్పిడిలో తమిళనాడు అగ్రస్థానం

● టీఎన్‌ఈబీ సీఎండీ రాధాకృష్ణన్ ● రెయిన్‌బో ఆస్పత్రిలో అడ్వాన్స్‌డ్ గ్యాస్ట్రో, లివర్ సెంటర్ ప్రారంభం

చెన్నై, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అవయవ మార్పిడిలో దక్షిణాసియాలోనే తమిళనాడు అగ్రస్థానంలో వుందని టీఎన్‌ఈబీ సీఎండీ డాక్టర్ జె.రాధాకృష్ణన్ పేర్కొన్నారు. గిండిలోని రెయిన్‌బో చిన్నారుల ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన 'అడ్వాన్స్‌డ్ పీడియాట్రిక్ గ్యాస్ట్రో అండ్ లివర్ సెంటర్‌ను బుధవారం ప్రారంభించిన రాధాకృష్ణన్.. మీడియాతో మాట్లాడుతూ.. ఆది నుంచి వైద్యరంగంలో తమిళనాడు ముందంజలో వుందని, అవయవ మార్పిడిలో కూడా తమిళనాడుదే పైచేయి అని తెలిపారు. రెయిన్‌బో ఆస్పత్రిలో నిపుణులైన వైద్యులున్నారని, చిన్నారులను రక్షించేందుకు వారు చేస్తున్న కృషి ప్రశంసనీయమన్నారు. చిన్నారుల కోసం ప్రత్యేకంగా గ్యాస్ట్రో, లివర్ సెంటర్‌ను ఏర్పాటు చేయడం ముదావహమన్నారు. ఈ కార్యక్రమంలో రెయిన్‌బో తమిళనాడు, ఏపీ జోనల్ డైరెక్టర్ డాక్టర్ బాస్కర్‌రెడ్డి, ఆస్పత్రి సీనియర్ కన్సల్టెంట్ డాక్టర్ సోమశేఖర్, డాక్టర్ కీర్తివాసన్, డాక్టర్ గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



అడ్వాన్స్‌డ్ పీడియాట్రిక్ గ్యాస్ట్రో, లివర్ కేంద్రాన్ని ప్రారంభోత్సవ దృశ్యం

రూ.13.40కోట్లతో కన్నదాసన్‌నగర్ బస్‌స్టేషన్

ప్యారీస్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్-చెన్నై (ఎంటీసీ) ఆధ్వర్యంలో రూ.13.40కోట్లతో కొడుంగైయూర్ సమీపంలోని కన్నదాసన్‌నగర్‌లో బస్‌స్టేషన్ నిర్మిస్తున్నారు. ఒకే సమయంలో 10 బస్సులు నిలిపే సౌకర్యాంతో పాటు ప్లాట్‌ఫారాల్లో వంద మంది కూర్చొనేలా సీటింగ్, 60మోటారు సైకిళ్లు, 2 కార్లు నిలిపేందుకు పార్కింగ్ సదుపాయం కల్పిస్తున్నారు. కింది, మొదటి అంతస్తులో పురుషులకు, స్త్రీల వేర్వేరుగా మరుగుదొడ్లను నిర్మిస్తున్నారు. అదేవిధంగా కింది అంతస్తులో 4 దుకాణాలు, మొదటి అంస్తులో 4 దుకాణాలకు స్థలం కేటాయించారు. ప్రయాణికులకే కాకుండా ఎంటీసీ ఉద్యోగులు కాసేపు సేదతీరేందుకు ప్రత్యేక విశ్రాంతిగదులను నిర్మించారు. గత సంవత్సరం జనవరిలో ప్రారంభమైన బస్‌స్టేషన్ నిర్మాణ పనులను ఇటీవల రవాణాశాఖ మంత్రి శివశంకర్ పరిశీలించి త్వరితగతిన పూర్తిచేయాలని ఎంటీసీ అధికారులను ఆదేశించారు.



నేటినుంచి కోవై సెమ్మొళి పార్క్ సందర్శనకు అనుమతి

పెరంబూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూర్ గాంధీ పురం సెమ్మొళి పార్క్‌ను గురువారం నుంచి ప్రజలు సందర్శించవచ్చు. కోవై గాంధీపురంలో 45 ఎకరాల్లో రూ.208.50 కోట్లతో ఏర్పాటుచేసిన సెమ్మొళి పార్క్‌ను గత నెల 25న ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. ఈ పార్క్‌లో క్లాసికల్ ఫారెస్ట్, హెర్బల్ గార్డెన్, వాటర్ గార్డెన్, ఫ్లవర్ గార్డెన్, వెదురు వనాలు, గులాబీ సహా 25 రకాలు తోటలు ఏర్పాటుచేశారు. సుమారు 2 వేలకు పైగా జాతులకు చెందిన 5 లక్షల మొక్కలు నాటారు. అలాగే, 500 మంది కూర్చొనేలా ఓపెన్-ఎయిర్ ఆడిటోరియం, పిల్లల కోసం ఇండోర్ ప్లే రూమ్, దివ్యాంగులకు ప్రత్యేక ఆట స్థలం, వివిధ ప్రాంతాల్లో సెల్ఫీ పాయింట్లు ఏర్పాటుచేశారు. పార్క్‌లో కొన్ని పనులు పూర్తికాకపోవడంతో, ప్రజలకు అనుమతించలేదు. ఈ క్రమంలో, పనులు పూర్తి కావడంతో గురువారం నుంచి పార్క్‌ను సందర్శించేందుకు జిల్లా యంత్రాంగం అనుమతించింది. ఉదయం 6 నుంచి రాత్రి 7 గంటల వరకు పార్క్ తెరచి ఉంటుందని, 10 ఏళ్లలోపున్న పిల్లలకు రూ.5, పెద్దలకు రూ.10 ప్రవేశ రుసుముగా నిర్ణయించారు. పార్క్‌లో వాకింగ్ చేసేందుకు నెలవారీ ఫీజు రూ.100, షార్ట్ ఫిల్మ్ షూటింగ్‌కు రోజుకు రూ.2,000, ఫీచర్ ఫిల్మ్ షూటింగ్‌కు రోజుకు రూ.25,000 ఫీజుగా నిర్ణయించినట్లు అధికారులు తెలిపారు.


పూలతో నిండిన సెమ్మొళి పార్క్

పారిశుధ్య కార్మికుడి నిజాయితీ

చెత్తలో దొరికిన కమ్మలు అప్పగింత

పెరంబూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కుప్ప చెత్తలో దొరికిన రూ. లక్ష విలువైన బంగారు కమ్మలను యజమానికి అప్పగించిన పారిశుధ్య కార్మికుడు నిజాయితీని అందరూ అభినందించారు. అంబత్తూర్ మండలం 82వ వార్డు జ్ఞానమూర్తి నగర్ దేవసి వీధికి చెందిన గిరిజ (55), తన ఇంటి లో చెత్తను చెత్త సేకరించే వాహనం లో వేసి వెళ్లింది. ఆ వాహనం తీసుకువచ్చిన కార్మికుడు నవీన్ కుమార్ చెత్తను విభజిస్తుండగా ఓ ప్లాస్టిక్ కవర్‌లో సవర బంగారు కమ్మలను గుర్తించాడు. ఈ విషయాన్ని సూపర్‌వైజర్ శ్రీనాథ్ శ్రీనివాసన్‌కు తెలియజేశాడు. ఇద్దరూ ఆ ప్రాంతానికి వెళ్లి విచారించి, దొరికిన కమ్మలు గిరిజకు చెందినవని గుర్తించి, ఆమెకు అందజేశారు. నవీన్‌కుమార్ నిజాయితీని చుట్టుపక్కల వారు, అధికారులు అభినందించారు.


కమ్మలు అందిస్తున్న పారిశుధ్య కార్మికుడు నవీన్ కుమార్

తిరుత్తణి ఆలయ కమిటీ సమావేశం

తిరుత్తణి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి సుబ్రమణ్యస్వామి ఆలయంలో డిసెంబరు 31న నిర్వహించనున్న మెట్లోత్సవం, జనవరి 1వ తేదీ ఆంగ్ల సంవత్సరాదిని పురస్కరించుకుని ఆలయంలో ప్రత్యేక ఏర్పాట్లను ఆలయ కమిటీ చేపట్టింది. దీనికి సంబంధించి బుధవారం ఉదయం ఆలయ కమిషనర్ రమణి అధ్యక్షతన సమీక్షా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఆరుద్ర వేడుకల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ఏర్పాటు చేయాలని ఆలయ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో కనిమొళి, ఆలయ ట్రస్ట్ బోర్డ్ సభ్యులు సురేష్‌బాబు, ఆలయ నిర్వాహకులు ఉషా, నాగన్, మోహన్ పాల్గొన్నారు.

వైభవంగా లక్ష తులసీదళార్చన

ప్యారీస్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక జార్జిటౌన్ వరదాముత్తియప్పవీధిలోని గీతా మందిరంలో లోకకల్యాణార్థం రాధాకృష్ణులకు లక్షతులసీదళార్చన చేశారు. మద్రాస్ యతిరాజ సేవా మహిళ మండలి నిర్వహణలోని గీతామందిరం 75వ వార్షికోత్సవం సందర్భంగా మొట్టమొదటిసారిగా లోకకల్యాణార్థం నిర్వహించిన ఈ పూజల్లో పాల్గొన్న భక్తుల రాధేశ్యామ్ నామస్మరణలతో మందిరం మార్మోగింది. బుధవారం ఉదయం సామూహిక విష్ణుసహస్రనామ పారాయణం, తులసీ దళార్చన, వేదపారాయణంతో రాధాకృష్ణులకు నిర్వహించిన పూజల్లో మండలి సభ్యులు పాల్గొన్నారు. చివరగా భక్తులందరికి అన్నప్రసాదాలు, తులసీదళాలను పంపిణీ చేశారు. లక్ష తులసీ దళార్చన విజయవంతం చేసిన సభ్యులందరికీ ఈ సందర్భంగా మద్రాస్ యతిరాజ సేవా మహిళా మండలి అధ్యక్షురాలు విజయలక్ష్మి ధన్యవాదాలు తెలిపారు. ధనుర్మాసం ప్రారంభమవుతున్న ఈ నెల 16 నుంచి జనవరి 14వ తేదీ వరకు మందిరంలో పాశురాల పఠించే కార్యక్రమం జరుగుతుందని, ఇందులో భాగంగా గోదాదేవి తిరుకల్యాణం కూడా సభ్యుల సమష్టి కృషితో నిర్వహించదలిచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి ఉషాగణేష్, ట్రెజరర్ కంకిపాటి శాంతకుమారి తదితరులు పాల్గొన్నారు.


రాధాకృష్ణులకు తులసీదళాలతో పూజ చేస్తున్న విజయలక్ష్మి బృందం

23 వరకు కొనసాగనున్న చలి తీవ్రత

పెరంబూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఈ నెల 23వ తేది వరకు తీవ్రమైన చలి కొనసాగుతుందని చెన్నై వాతావరణ కేంద్రం తెలిపింది. ఈ మేరకు వాతావరణ కేంద్రం విడుదల చేసిన ప్రకటనలో... గాలులు ఉత్తరం నుంచి దక్షిణం వైపు వీస్తున్నాయని, ఆ గాలులు తమిళనాడు మీదుగా ప్రయాణిస్తున్నాయని, దీని కారణంగా రాష్ట్రంలోని తీరప్రాంతాల్లో చలి తీవ్రత అధికంగా ఉంటుందని తెలిపింది. అదే సమయంలో, హిమాలయాల నుంచి దక్షిణం వైపు వీస్తున్న చల్లని గాలుల ప్రభావంతో చెన్నై, తిరువళ్లూర్, చెంగల్పట్టు, కళ్లకుర్చి, విల్లుపురం తదితర జిల్లాల్లో ఈ నెల 16, 17, 18 తేదీల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశముందని వాతావరణ కేంద్రం తెలిపింది.

నగరానికి చేరుకున్న 33 మంది జాలర్లు

పెరంబూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): శ్రీలంక జైళ్ల నుంచి విడుదలైన 33మంది జాలర్లు బుధవారం ఉదయం శ్రీలంక నుంచి విమానం ద్వారా నగరానికి చేరుకున్నారు. సరిహద్దులు దాటి చేపలు పడుతున్నారంటూ నాగపట్టణం, మైలాడుదురై, కోటపట్టణం, రామేశ్వరం ప్రాంతాలకు చెందిన 33మంది జాలర్లను శ్రీలంక నావికాదళం అరెస్ట్ చేసి, కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించింది. శ్రీలంక అరెస్ట్ చేసిన జాలర్లను విడిపించేలా చర్యలు చేపట్టాలని సీఎం స్టాలిన్ కేంద్ర విదేశీ వ్యవహారాలశాఖ మంత్రి జయశంకర్‌కు లేఖ రాశారు. ఈ విషయమై ఆ దేశ ప్రభుత్వంతో జరిపిన చర్చలు ఫలించి, 33మంది జాలర్లను విడుదల చేసిన లంక ప్రభుత్వ, వారిని శ్రీలంలోని భారత దౌత్యాధికారి కార్యాలయంలో అప్పగించింది. బుధవారం ఉదయం జాలర్లు శ్రీలంక నుంచి విమానంలో నగరానికి చేరుకున్నారు. జాలర్లకు స్వాగతం పలికిన మత్స్యశాఖ అధికారులు, ప్రత్యేక వాహనాల్లో వారి వారి స్వగ్రామాలకు పంపించారు.

హాకీ పోటీలకు బయల్దేరిన విద్యార్థులు

వేలూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని చెన్నైలో జరిగే పురుషుల హాకీ జూనియర్ వరల్డ్ కప్-2025 పోటీలు తిలకించేందుకు వేలూరులోని పలుపాఠశాల విద్యార్థులను ఆ పాఠశాల నిర్వాహకులు పంపిస్తున్నారు. ఈ నేపథ్యంలో, బుధవారం ఉదయం చెన్నై బయలుదేరుతున్న ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల బస్సును జిల్లా రెవెన్యూ అధికారి శివసుబ్రమణ్యం జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారిణి ప్రేమలత, జిల్లా క్రీడాభివృద్ధిశాఖ అధికారి సుబ్రమణి, జిల్లా వ్యాయామశాఖ ఇన్‌స్పెక్టర్ సరస్వతి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులతో పాఠశాల ఉపాధ్యాయులు

ఆహో ఏమి రుచి... తినరా మైమరిచి...

● అన్నాడీఎంకే సమావేశంలో నోరూరించిన వంటకాలు

ప్యారీస్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక వానగరంలో బుధవారం నిర్వహించిన అన్నాడీఎంకే సర్వసభ్య మండలి సమావేశానికి హాజరైన సభ్యులకు గుమగుమలాడే రుచులతో వెజిటేరియన్, నాన్ వెజిటేరియన్ పదార్థాలను వడ్డించారు. వానగరంలోని శ్రీవారు కల్యాణ మండపం ప్రాంగణంలో నిర్వహించిన ఈ సమావేశంలో ఆహ్వానాలున్న సుమారు 5వేల మంది కార్యకర్తలు పాల్గొన్నారు. ఆ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన డైనింగ్ హాలులో ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం భోజనాలు వడ్డించారు. అల్పాహారంలో కేసరి, వడ, పొంగల్, ఇడ్లీ సాంబార్, టీ, కాఫీ అందజేశారు. మధ్యాహ్నం భోజనంలో నాన్-వెజిటేరియన్ మెనూలో బ్రెడ్ హల్వా, మటన్ బిర్యానీ, చికెన్ బిర్యానీ, చెట్టినాడు మటన్‌ఫ్రై, చికెన్ 65, వంజరం చేప ఫ్రై, ఎగ్ మసాల, పాయసం, పెరుగుపచ్చడి, వంకాయ కుర్మా తదితర 16 రకాల వంటకాలను వేడివేడిగా వడ్డించారు. శాఖాహారులకు దమ్‌ఫ్రూట్ హల్వా, అల్లంచెట్నీ, చైనీస్, పొట్లకాయ వేపుడు, బంగాలదుంప వేపుడు, వడ, అప్పడం, ఊరగాయ, వెజ్ పులావ్, బీన్స్ సాంబరు తదితరాలను వడ్డించారు. అదే సమయంలో సమావేశం మధ్యలో మిక్సర్, చిప్స్, బిస్కెట్, వాటర్ బాటిల్స్, శీతల పానియాలను సభ్యులు కూర్చున్న చోటుకే వెళ్లి క్యాటరింగ్ సిబ్బంది అందజేయడం గమనార్హం.


సమావేశంలో వడ్డించిన రకరకాల వంటలు

కాంచీపురం జిల్లాలో 'సేజ్ హిల్' స్కూల్

చెన్నై, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కాంచీపురం జిల్లా దమల్‌లో 'సేజ్ హిల్' పేరుతో సంపూర్ణ రెసిడెన్షియల్ కేంబ్రిడ్జ్ స్కూల్ ఏర్పాటైంది. వానగరంలోని 'వేదాంత అకాడమీ' సీబీఎస్ఈ సీనియర్ సెకండరీ స్కూల్ మాతృసంస్థ అయిన 'నీల్ కేశవ్ ఎడ్యుకేషన్ ట్రస్ట్' దీనిని కూడా ఏర్పాటు చేసింది. సేజ్ హిల్ వ్యవస్థాపకులు సందీప్ వాసు బుధవారం చెన్నైలో జరిగిన మీడియా సమావేశంలో వివరాలు వెల్లడించారు. చెన్నై-బెంగుళూరు హైవేలో ఏర్పాటైన ఈ స్కూలులో 202-27 నుంచి తరగతులు ప్రారంభమవుతాయన్నారు. కేంబ్రిడ్జ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేషన్ (సీఐఈ)లో ముందుగా 4 నుంచి 9వ గ్రేడ్ వరకు తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. చెన్నైలో ఇదే తొలి పూర్తి రెసిడెన్షియల్ కేంబ్రిడ్జ్ స్కూలు అని వివరించారు.



మాట్లాడుతున్న సందీప్ వాసు తదితరులు

విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ

తిరుత్తణి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టు ప్రభుత్వ బాలికల మహోన్నత పాఠశాల విద్యార్థినులకు మంగళవారం సాయంత్రం సైకిళ్ల పంపిణీ కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన తిరుత్తణి ఎమ్మెల్యే ఎస్.చంద్రన్ విద్యార్థినులకు రాష్ట్రప్రభుత్వ పంపిణీ చేసిన సైకిళ్లను అందజేశారు. మండల డీఎంకే కన్వీనర్ శ్రీనివాసన్, పీటీఏ అధ్యక్షుడు జ్యోతికుమార్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

వేలూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయిలో జరిగిన ప్రభుత్వ సైన్స్ టాలెంట్ టెస్ట్‌లో గెలుపొందిన విద్యార్థినీ విద్యార్థులకు బుధవారం ఉదయం వేలూరు కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి ఆధ్వర్యంలో నగదు బహుమతులు అందజేశారు.

సమాచార దర్శిని

'అసిస్టెంట్ కుక్' పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): పౌష్టికాహార కేంద్రాల్లోఖాళీగా ఉన్న 'అసిస్టెంట్ కుక్' పోస్టులకు ఆసక్తి కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ మేరకు తిరువళ్లూర్ జిల్లా కలెక్టర్ ప్రతాప్ విడుదల చేసిన ప్రకటనలో... తిరువళ్లూర్ జిల్లాలోని పాఠశాలల్లో ఉన్న పౌష్టికాహార కేంద్రాల్లో అసిస్టెంట్ కుక్ పోస్టులను ప్రత్యక్ష పద్ధతిలో భర్తీ చేయనున్నామన్నారు. పూందమల్లి యూనియన్‌లో 11పోస్టులు, విల్లివాక్కంలో మూడు, కడంబత్తూర్‌లో 1 పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. సంబంధిత ప్రాంతీయ అభివద్ధి కార్యాలయం, www.tiruvallur.nic.in అనే వెబ్‌సైట్ నుంచి దరఖాస్తులు పొంది, పూర్తిచేసి ఈ నెల 22వ తేదిలోపు యూనియన్ కార్యాలయాల్లో సమర్పించాలని కలెక్టర్ తెలిపారు.

నేడు 40 మంది భాషా సేవకులకు సత్కారం

చెన్నై, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మహాకవి సుబ్రమణ్య భారతీయార్ 144వ జయంతి, 'భారతీయ భాషా దివస్'ను పురస్కరించుకుని వివిధ భాషలకు సేవలందించిన పలు రాష్ట్రాలకు చెందిన 40 మంది సాహిత్యకారులను గవర్నర్ ఆర్ఎన్ రవి గురువారం సత్కరించనున్నారు. ఇందులో ఐదుగురు తెలుగువారు కూడా ఉండడం విశేషం. ఉదయం 11 గంటలకు లోక్‌భవన్‌లోని భారతీయార్ మండపంలో ఈ కార్యక్రమం జరుగనుంది. తెలుగు భాష కోసం విశేష కృషి చేసిన చెన్నైకి చెందిన విశ్రాంత అధ్యాపకురాలు డాక్టర్ ఆర్.విజయలక్ష్మి, డాక్టర్ నీరజ తిరుమల, డాక్టర్ తిరుమల ఆముక్త మాల్యద, తెప్పల శ్రీనివాస్, తిరుపతి శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయ విశ్రాంత ప్రొఫెసర్ డాక్టర్ జె.మునిరత్నంలను కూడా గవర్నర్ సత్కరించనున్నారు.

తిరుచెందూర్ దర్శనవేళల్లో మార్పు

పెరంబూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మార్గళి నెల పూర్తిగా తిరుచెందూర్ ఆలయ వేళల్లో మార్పులు చేశారు. ఈ మేరకు ఆలయ నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో... మార్గళి 1 నుంచి 30వ తేది వరకు వేకువజామున 3 గంటలకు ఆలయాన్ని తెరవనున్నారు. 3.30 గంటలకు విశ్వరూప దీపారాధన, ఉదయం 5 గంటలకు, 7.30 గంటలకు అభిషేకం నిర్వహించనున్నారు. ఈ నెల 17, జనవరి 1న మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రదోష అభిషేకం నిర్వహించనున్నారు. ఆంగ్ల సంవత్సరం సందర్భంగా వేకువజామున 1 గంటకు ఆలయాన్ని తెరవనున్నారు. మార్గళి 19న ఆరుద్ర దర్శనం సందర్భంగా తెల్లవారుజామున 2 గంటలకు ఆలయం తెరవనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

నేడు టీవీకే జిల్లా కార్యదర్శుల సమావేశం

పెరంబూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తమిళగ వెట్రి కళగం (టీవీకే) జిల్లా కార్యదర్శుల అత్యవసర సమావేశం గురువారం జరుగనుంది. తమిళనాడు, పుదుచ్చేరిలో 2026 శాసనసభ ఎన్నికల్లో పోటీచేసేందుకు విజయ్ నేతృత్వంలోని టీవీకే సిద్ధమవుతోంది. కరూర్‌లో సెప్టెంబరు 27న జరిగిన తొక్కిసలాట ఘటన అనంతరం విజయ్ తన ప్రచారం నిలిపివేశారు. తన ప్రచారాన్ని మళ్లీ ప్రారంభించాలని నిర్ణయించిన విజయ్, ఈ నెల 18న ఈరోడ్‌లో బహిరంగ సభకు సన్నాహాలు చేపట్టారు. ఈ క్రమంలో, ఆ పార్టీ జిల్లా కార్యదర్శుల అత్యవసర సమావేశం గురువారం పనయూర్‌లోని పార్టీ కార్యాలయంలో జరుగనుంది.

పాఠశాలల ప్రాంగణాల్లో ఐటీఐ కేంద్రాలు

పెరంబూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల ప్రాంగణాల్లో వృత్తి శిక్షణ కేంద్రం(ఐటీఐ) ఏర్పాటుచేయాలని పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. ఈ మేరకు పాఠశాల విద్యా డైరెక్టరేట్, అన్ని జిల్లాల ప్రధాన విద్యాధికారులకు పంపిన సర్క్యులర్‌లో వివరాలిలా ఉన్నాయి... ప్రభుత్వ ఉన్నత, మహోన్నత పాఠశాలల ప్రాంగణంలో ఐటీఐలు ఏర్పాటు చేయాలని నిర్ణయించామన్నారు. ఐటీఐలు లేని ప్రాంతా ల్లోని పాఠశాలలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలిపారు. ఈ కేంద్రాల ద్వారా విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు సత్వరం కల్పించే అవకాశం ఉంటుందన్నారు. అన్ని వసతులు కలిగిన ప్రభుత్వ ఉన్నత, పాఠశాలలను ఎంపిక చేసి పాఠశాల విద్యా డైరెక్టరేట్‌కు పంపించాలని సర్క్యులర్‌లో తెలిపారు.

దివ్యాంగ విద్యార్థులకు స్కాలర్ షిప్

పెరంబూర్, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): చెంగల్పట్టు జిల్లాలో పాఠశాల, కళాశాలల్లో చదువుతున్న దివ్యాంగ విద్యార్థినీ, విద్యార్థులు స్కాలర్ షిప్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చు. 1 నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు రూ.2,000, 6 నుంచి 8వ తరగతి విద్యార్థులకు రూ.6,000, 9 నుంచి ప్లస్ టూ విద్యార్థులకు రూ.8,000 అందిజేయనున్నారు. అలాగే, యూజీ విద్యార్థులకు రూ.12,000, పీజీ విద్యార్థులకు రూ.14,000 స్కాలర్‌షిప్ ఇవ్వ నున్నారు. స్కాలర్ షిప్ కోసం 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన జాతీయ దివ్యాంగుల గుర్తింపు కార్డు, ప్రత్యేక జాతీయ గుర్తింపు వైద్య ధ్రువ పత్రం, ఆధార్, రేషన్ కార్డు, విద్యార్హత పత్రం, ఫొటోతో ప్రభుత్వ ఈ-సేవా కేంద్రాల ద్వారా దరఖాస్తులు సమర్పించాలని జిల్లా యంత్రాంగం ఒక ప్రకటనలో తెలిపింది.

నరసాపురం వరకు 'వందే భారత్'

పెరంబూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చెన్నై సెంట్రల్-విజయవాడ మధ్య నడుపుతున్న వందే భారత్ రైళ్లను పశ్చిమగోదావరి జిల్లా నరసాపురం వరకు తాత్కాలికంగా పొడిగించారు. ఈ మేరకు దక్షిణ రైల్వే విడుదల చేసిన ప్రకటనలో... నెం.20677 చెన్నై సెంట్రల్-నరసాపురం వందే భారత్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 15 నుంచి జనవరి 11వ తేది వరకు చెన్నై సెంట్రల్‌లో ఉదయం 5.30 గంటలకు బయల్దేరి 7.05 గంటలకు రేణిగుంట, 8.29 గంటలకు నెల్లూరు, 9.43 గంటలకు ఒంగోలు, 11.08 గంటలకు విజయవాడ, మధ్యాహ్నం 12.29 గుడివాడ, 1.14 గంటలకు భీమవరం టౌన్, 2.10 గంటలకు నరసాపురం చేరుకుంటుంది. మరుమార్గంలో, నెం.20678 నరసాపురం-చెన్నై సెంట్రల్ వందే భారత్ ఈ నెల 17 నుంచి జనవరి 11వ తేది వరకు నరసాపురంలో మధ్యాహ్నం 2.50 గంటలకు బయల్దేరి 3.19 గంటలకు భీమవరం టౌన్, సాయంత్రం 4.04 గంటలకు గుడివాడ, 4.50 గంటలకు విజయవాడ, 6.29 గంటలకు ఒంగోలు, రాత్రి 7.39 గంటలకు నెల్లూరు, 9.50 గంటలకు రేణిగుంట, 11.45 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుందని దక్షిణ రైల్వే తెలిపింది.

కొత్త ఓటర్లకు 'ఫారం-6' పంపిణీ

పెరంబూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చెన్నై జిల్లాలో కొత్త ఓటర్లకు చేర్చేలా, 'ఫారం-6' వినియోగం ప్రారంభించారు. చెన్నై జిల్లా పరిధిలోని 16 నియోజకవర్గాల ఓటరు జాబితా సవరణ (సర్) పనులు నవంబరు 4వ తేది నుంచి ప్రారంభం కాగా, ఇప్పటివరకు 40.04 లక్షల మంది ఓటర్లలో, 39.59 లక్షల మందికి ఫారాలు అందజేశారు. పూర్తిచేసిన ఫారాలు తిరిగి పొందడం, వాటిని ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ జరుగుతున్నాయి. ఈ పనులకు గురువారం చివరి రోజు కాగా, కొత్త ఓటర్లను చేర్చేలా 'ఫారం-6' వినియోగం ప్రారంభించారు. ఈ విషయమై జిల్లా ఎన్నికల అధికారి, కార్పొరేషన్ కమిషన్ కుమరగురుపరన్ మాట్లాడుతూ.. సర్ పనుల్లో ఒక్కో బూత్ లెవల్ అధికారులకు, కొత్త ఓటర్లను చేర్చేలా ఫారం-6, సవరణలకు ఫారం-8 అందించామన్నారు. సర్ పనుల కారణంగా, కొత్త ఓటర్లు చేర్చేలా ఫారం పంపిణీ చేసేందుకు వీలు కాలేదని తెలిపారు. ప్రస్తుతం సర్ పనులు పూర్తికావడంతో, కొత్త ఓటర్లను చేర్చే పనులు ప్రారంభించామన్నారు. ఈ నెల 16వ తేది అనంతరం కొత్త ఓటర్లను చేర్చేందుకు ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు ఎన్నికల అధికారి తెలిపారు.

మహాదీపం సందర్శనకు కొండ ఎక్కిన భక్తుడి మృతి

పెరంబూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): కార్తీక దీపం సందర్శనకు కొండ ఎక్కిన భక్తుడు అస్వస్థతకు గురై మృతిచెందాడు. తిరువణ్ణామలైలో కార్తీక దీపోత్సవాల్లో ప్రధానాంశమైన మహా దీపం వెలిగించే కార్యక్రమం ఈనెల 3వ తేది జరిగింది. ఈ దీపాన్ని 11 రోజుల పాటు భక్తులు దర్శనం చేసుకోవచ్చు. ముందు జాగ్రత్తగా మహాదీప దర్శనానికి కొండపైకి వెళ్లేందుకు భక్తులకు నిషేధం విధించింది. కొండ దిగువ భాగంలో పోలీసులు, కొండ ఎక్కేందుకు వచ్చే భక్తులను అడ్డుకుంటున్నారు. ఈ క్రమంలో, మంగళవారం ఉదయం పోలీసుల కళ్లు గప్పి ఓ యువకుడు కొండ పైకి ఎక్కాడు. మార్గమధ్యంలో హఠాత్తుగా అతను అస్వస్థతకు గురై శ్వాస తీసుకోలేక ఇబ్బంది పడ్డాడు. అక్కడ విధుల్లో ఉన్న అటవీ సిబ్బంది అతడిని వెంటనే కొండ దిగువకు తీసుకొచ్చి, అంబులెన్స్‌లో తిరువణ్ణామలై ప్రభుత్వ వైద్యకళాశాల ఆస్పత్రికి తరలించగా, అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడు పెరంబలూరు జిల్లా తొలూత్తూర్ ప్రాంతానికి చెందిన సంతోష్ (35)గా గుర్తించిన తిరువణ్ణామలై టౌన్ పోలీసులు, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రజా సమస్యల పరిష్కారంపై శ్రద్ధ చూపాలి


సమస్యలు తెలుసుకుంటున్న పోలీసు కమిషనర్ అరుణ్

పెరంబూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి శ్రద్ధ చూపాలని పోలీసు కమిషనర్ అరుణ్ ఆదేశించారు. వెప్పేరిలోని పోలీసు కమిషనర్ కార్యాలయంలో బుధవారం ప్రజా సమస్యల పరిష్కార శిబిరం జరిగింది. ఈ కార్యక్రమంలో పోలీసు కమిషనర్ అరుణ్ ప్రజల నుంచి వినతిపత్రాలు స్వీకరించారు. అలాగే, వారి సమస్యలను అడిగి తెలుసుకుని, సత్వరం విచారించి చర్యలు చేపట్టాలని సంబంధిత పోలీసు స్టేషన్ అధికారులను కమిషనర్ ఆదేశించారు. ప్రతి బుధవారం జరిగే ఈ గ్రీవెన్స్‌లో ప్రజలు పాల్గొని తమ సమస్యలు తెలిపి పరిష్కారం పొందాలని నగర పోలీసు కార్యాలయం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేసింది.

మార్కుల కోసం ఒత్తిడి... టెన్త్ విద్యార్థి ఆత్మహత్య

పెరంబూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎక్కువ మార్కులు తెచ్చుకోవాలంటూ తల్లిదండ్రులు ఒత్తిడి తట్టుకోలేక ఓ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన కడలూరు జిల్లాలో చోటుచేసుకుంది. అరసిపెరియాంకుప్పం ప్రాంతానికి చెందిన హరిప్రసాద్ (15) కడలూరులోని ఓ ప్రైవేటు పాఠశాలలో 10వ తరగతి చదువుతున్నాడు. పాఠశాలల్లో నిర్వహిస్తున్న అన్నిపరీక్షల్లో మంచి మార్కులు సాధిస్తున్న హరిప్రసాద్, ప్రస్తుతం అర్ధవార్షిక పరీక్షలు రాస్తున్నాడు. ఈ క్రమంలో, బుధవారం ఉదయం పరీక్షకు హరిప్రసాద్ బయల్దేరిన సమయంలో, మచి మార్కులు రావాలని తల్లిదండ్రులు హెచ్చరించారు. ఈ కారణంగా మానసిక ఒత్తిడికి గురైన హరిప్రసాద్ వంట గదిలో ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై తిరుప్పాదిరిపులియూర్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

మార్గబందీశ్వరాలయ ఉత్సవాలపై కలెక్టర్ సమీక్ష


సమస్యలు తెలుసుకుంటున్న పోలీసు కమిషనర్ అరుణ్

వేలూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేలూరు జిల్లా అనైకట్టు సమీపంలోని విరింజిపురంలో కొలువుదీరిన మార్గబందీశ్వరాలయంలో ఆదివారం జరగనున్న తీర్థకొలను ఉత్సవాలకు సంబంధించి కలెక్టర్ సుబ్బులక్ష్మి బుధవారం అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, కార్తిక మాస చివరి ఆదివారంలో నిర్వహించే తీర్థకొలను ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకోకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ మయిల్ వాహనన్, ఆర్డీవో శివసుబ్రమణ్యన్ సహా పలు శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

డీకేఎం మహిళా కళాశాలలో సైన్స్ సదస్సు

వేలూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): వేలూరులోని డీకేఎం మహిళా కళాశాల ప్రాంగణంలో బుధవారం ఉదయం తమిళనాడు సైన్స్ సదస్సు జరిగింది. కళాశాల సైన్స్‌శాఖ అధ్యక్షురాలు దేవి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ రచయిత్రి ఆయేషా నటరాజన్ రాసిన వంద మంది జ్ఞానులు అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ తొలి ప్రతిని లెక్చరర్ శశికళ అందుకున్నారు. అనంతరం రాష్ట్ర సైన్స్ విభాగం అధికారులు సైన్స్ పరిశోధనల కోసం కళాశాల నిర్వాహకుల సమక్షంలో ఒప్పందపత్రాలపై సంతకాలు చేశారు. పలు సైన్స్ కార్యక్రమాల్లో గెలుపొందిన పాఠశాలల ఉపాధ్యాయులకు డీకేఎం కళాశాల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించి జ్ఞాపికలు బహూకరించారు. కళాశాల నిర్వాహకులు కృష్ణస్వామి ముదలియార్, ప్రభుత్వ ప్రాథమికపాఠశాల ఉపాధ్యాయురాలు కవిత, ప్రభుత్వ ముస్లిం పాఠశాల ప్రిన్సిపల్ స్నేహలత తదితరులు పాల్గొన్నారు.






సభా ప్రాంగణం ప్రవేశద్వారం వద్ద గుమికూడిన పార్టీ శ్రేణులు - ప్రవేశద్వారం వద్ద అన్నాదురై, ఎంజీఆర్, జయలలిత, ఈపీఎస్ భారీ కటౌట్లు - మాజీ మంత్రుల కోసం అందంగా ఏర్పాటు చేసిన స్వాగత ద్వారం - ఈపీఎస్ రాక సందర్భంగా మధురవాయల్- పూందమల్లి జాతీయ రహదారిలో స్తంభించిన ట్రాఫిక్

కలిసే పోటీ

అన్నాడీఎంకే సర్వసభ్యమండలి సమావేశంలో ప్రకటన

డీఎంకే పాలనను ఖండిస్తూ తీర్మానాలు



వానగరంలో అన్నాడీఎంకే సర్వసభ్యమండలి సమావేశం ప్రారంభానికి ముందు పార్టీ దివంగత నేతలు ఎంజీఆర్, జయలలిత చిత్రపటాలకు నమస్కరిస్తున్న ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి

చెన్నై, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): అన్నాడీఎంకే సర్వసభ్యమండలి సమావేశంలో 16 తీర్మానాలు చేశారు. వీటిలో డీఎంకే ప్రభుత్వ వైఫల్యాలను తీవ్రంగా విమర్శిస్తూ చేసిన తీర్మానాలే అధికంగా ఉన్నాయి. ఎన్నికల సంఘం నిర్వహించిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను స్వాగతిస్తూ, కూటమిలో పార్టీలను చేర్చుకునే అధికారం ఈపీఎస్‌కు కల్పిస్తూ చేసిన తీర్మానాల వివరాలిలా ఉన్నాయి...

1. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఏర్పడనున్న (ఎన్డీయే) కూటమికి అన్నాడీఎంకే నేతృత్వం వహిస్తుంది. 2. రాబోవు శాసనసభ ఎన్నికల్లో అన్నాడీఎంకే - బీజేపీ కలిసి పోటీ చేస్తాయి. 3. కోవై, మదురై మెట్రోరైలు ప్రాజెక్టులకు అనుమతి వ్వాలని కేంద్రానికి విజ్ఞప్తి. 4. ఇటీవల వర్షబాధితులు, వరద బాధితులను ఆదుకోవడంలో డీఎంకే ప్రభుత్వం విఫలం. తుఫాను బాధిత ప్రాంతాల్లోని రైతులకు ఎకరాకు రూ.30వేల నష్టపరిహారంగా చెల్లించాలని డిమాండ్. 5. కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహించిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణకు స్వాగతం. 6. ధాన్యంలో తేమ 22 శాతానికి పెంచి కొనుగోలు చేయాలని డీఎంకే ప్రభుత్వానికి డిమాండ్. 7. విదేశీ, స్వదేశీ పారిశ్రామిక పెట్టుబడులను అత్యధికంగా సమీకరించినట్లు తప్పుడు గణాంకాలు చెబుతున్న డీఎంకే ప్రభుత్వానికి, సీఎం స్టాలిన్‌కు ఖండన. పెట్టుబడుల సేకరణలో రాష్ట్ర ప్రభుత్వం ఘోరంగా విఫలం. 8. రాష్ట్ర ప్రజలపై రుణభారాన్ని పెంచుతున్న డీఎంకే ప్రభుత్వానికి ఖండన.

కిక్కిరిసిన వానగరం ..

రాష్ట్రం నలువైపుల నుంచి తరలివచ్చిన అన్నాడీఎంకే కార్యకర్తలతు వానరం జనసంద్రంగా మారింది. ఎటు చూసినా అన్నాడీఎంకే కార్యకర్తలు, ఆ పార్టీ వాహనాలే దర్శనమిచ్చాయి. వాహనాల రద్దీతో ట్రాఫిక్ స్తంభించగా, స్థానికులు ఇక్కట్ల పాలయ్యారు.

9. రాష్ట్రంలో గత నాలుగున్నర సంవత్సరాలుగా బాలికలు, మహిళలకు భద్రత కల్పించడంలో డీఎంకే ప్రభుత్వం విఫలమైంది. హోంశాఖ నిర్వర్తిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్ మహిళలకు రక్షణ కల్పించలేకపోతున్నారు. 10. ప్రజలకు భద్రత కల్పించడంలో విఫలమైన డీఎంకే ప్రభుత్వాన్ని ఖండిస్తూ తీర్మానం. 11. నీట్ రద్దు సహా ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన హామీలను నెరవేర్చని డీఎంకే ప్రభుత్వానికి ఖండన. 12. మదురై కార్పొరేషన్‌లో విచ్చలవిడిగా జరిగిన అవినీతిపై ఖండన. 13. షెడ్యూలు కులాలు, బలహీన వర్గాలవారిని కించపరుస్తూ వారి మధ్య అంటరానితనాన్ని కలిగిస్తున్న డీఎంకే ప్రభుత్వ వైఖరికి ఖండన. 14. అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో ఉప్పిలియాపురం - గోల్డ్‌విన్స్ వరకు అతిపొడవైన ఫ్లైఓవర్ పథకానికి డీఎంకే లేబుల్ అతికించి తమ ప్రాజెక్టుగా ప్రకటించుకున్న రాష్ట్ర ప్రభుత్వానికి ఖండన.

15. న్యాయవ్యవస్థలో జోక్యం చేసుకుంటున్న డీఎంకే ప్రభుత్వ వైఖరిని ఖండిస్తూ తీర్మానం. న్యాయమూర్తుల పట్ల పాలకులు బెదిరింపు ధోరణి గర్హనీయమని హితవు. 16. అసెంబ్లీ ఎన్నికల్లో ఏయే పార్టీలతో పొత్తుపెట్టుకోవాలన్న విషయమై నిర్ణయం తీసుకునే అధికారం పార్టీ ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామికి అప్పగిస్తూ తీర్మానం.



స్వామివారి దర్శనం కోసం వెళ్తున్న హీరో ధనుష్, డైరెక్టర్ విగ్నేష్‌రాజా

నెల్లయప్పర్ ఆలయంలో హీరో ధనుష్ పూజలు

చెన్నై, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ తమిళ సినీ నటుడు ధనుష్ బుధవారం వేకువజామున తిరునల్వేలిలోని సుప్రసిద్ధ నెల్లయప్పర్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధనుష్ తాజాగా 'టీ-54' మూవీలో నటిస్తున్నారు. ఆ మూవీ షూటింగ్ తిరునల్వేలి, తెన్‌కాశి పరిసర ప్రాంతాల్లో శరవేగంగా జరుగుతోంది. ఈ నేపథ్యంలో ఆ మూవీ డైరెక్టర్ విగ్నేష్‌రాజా, హీరో ధనుష్ తదితరులు వేకువజాము నెల్లయప్పర్ ఆలయానికి వెళ్లారు. ఆలయంలో నిర్వహించిన తిరువనందల్ ఆరాధన, పూజలకు హాజరయ్యారు. అమ్మవారు, స్వామివారి సన్నిధుల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు, అర్చకులు ధనుష్ తదితరులకు ప్రసాదాలను అందజేశారు. దర్శనం అనంతరం నడిచి వెళుతున్న ధనుష్‌తో యువకులు పోటీపడి సెల్ఫీలు తీసుకుని సందడి చేశారు.

వడపళని సిమ్స్ హాస్పిటల్‌లో కీహోల్ పద్ధతిలో కణితి తొలగింపు



శస్త్రచికిత్స వివరాలను తెలుపుతున్న సిమ్స్‌వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రాజు శివసామి, హృద్రోగ శస్త్రచికిత్స వైద్యనిపుణుడు డాక్టర్ వీవీ బాషి, డాక్టర్ ఎ. మహమ్మద్ ఇబ్రహీం

చెన్నై, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): స్థానిక వడపళనిలోని సిమ్స్ హాస్పిటల్‌లో 45 యేళ్ల మహిళ గుండె ఎడమవైపు పెరిగిన కణితిని కీహోల్ పద్ధతిలో శస్త్రచికిత్స ద్వారా తొలగించి ప్రాణాపాయం నుంచి కాపాడినట్లు హాస్పిటల్ హృద్రోగ శస్త్రచికిత్సా విభాగం డైరెక్టర్ డాక్టర్ వీవీ బాషి తెలిపారు. బుధవారం మధ్యాహ్నం ఆస్పత్రి ప్రాంగణంలో మీడియా సమావేశంలో శస్త్రచికిత్స వివరాలను తెలియజేశారు. తీవ్ర అస్వస్థతకు గురై హాస్పిటల్‌లో చేరిన ఆ మహిళకు ఎంఆర్ఐ స్కాన్ చేసి చూడగా, 1.6 సెం.మీల ఎత్తు, 1.5 సెం.మీ.ల వెడల్పుతో ఓ కణితి ఉన్నట్లు గుర్తించామన్నారు. సాధారణంగా ఇలాంటి కణితులను తొలగించేందుకు ఛాతీ కోసి ఆపరేషన్ చేయడం ఆనవాయితీ అని, అయితే ఈ మహిళకు కీహోల్ పద్ధతి ద్వారా అధిక రక్తస్రావానికి తావులేకుండా కణితి తొలగించామని, కొద్ది రోజులకే ఆమె కోలుకున్నారని చెప్పారు. ఈ సమావేశంలో సిమ్స్ హాస్పిటల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ రాజు శివసామి, డాక్టర్ ఎ.మహమ్మద్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

తమిళ కథలతో సామాజిక మార్పు

● ఉపముఖ్యమంత్రి ఉదయనిధి



ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఉదయనిధి, సుశాంత్ శ్రీరామ్ తదితరులు

చెన్నై, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తమిళ రచయితల కథలు సామాజిక మార్పునకు ఆయుధాలని, అన్నాదురై, కలైంజర్ కరుణానిధి సంభాషణలు ప్రేక్షకులని అలరించడమే గాక, గొప్ప స్ఫూర్తినిచ్చాయని ఉపముఖ్యమంత్రి ఉదయనిధి పేర్కొన్నారు. 'జియో హాట్ స్టార్' దక్షిణాదిలో భారీ పెట్టుబడితో వినోద రంగాన్ని కొత్త పుంతలు తొక్కించేందుకు తమిళనాడు ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఇటీవల చెన్నైలో ఉపముఖ్యమంత్రి ఉదయనిధి, రాష్ట్ర తమిళ భాషాభివృద్ధి, సమాచార శాఖ మంత్రి ఎంపీ స్వామినాధన్ తదితరుల సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. ఈ కార్యక్రమంలో నట దిగ్గజాలు కమల్‌హాసన్, మోహన్‌లాల్, నాగార్జున, విజయ్‌సేతుపతి, రెహమాన్‌తో పాటు సాంకేతిక నిపుణులు, నిర్మాతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయనిధి మాట్లాడుతూ.. తమిళనాడు దక్షిణాది రాష్ట్రాలకు కేంద్రమని, తెలుగు, కన్నడ, మలయాళ సినిమాలు ఇక్కడే పుట్టాయని వివరించారు. జియో హాట్‌స్టార్ అమలు చేస్తున్న నూతన ప్రాజెక్టును స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఈ భాగస్వామ్యం ఒప్పందంతో యువ కళాకారులకు ఆధునిక సాంకేతికత ఆధారంగా శిక్షణ ఇవ్వడానికి దోహదపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జియోస్టార్ ఎస్వీపీటీడీ బిజినెస్, చీఫ్ మార్కెట్ ఆఫీసర్ హెడ్ సుశాంత్ శ్రీరామ్, జియోస్టార్ ఎంటర్‌టైన్‌మెంట్ హెడ్ (సౌత్) కృష్ణన్ కుట్టి తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయులకు నెలకు రూ.12వేల పింఛన్

● 42 మందికి పంపిణీ చేసిన సీఎం స్టాలిన్



సీఎం స్టాలిన్ చేతుల మీదుగా పింఛన్ ఉత్తర్వులు అందుకుంటున్న పాత్రికేయులు

ప్యారీస్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): పత్రికా రంగంలో పదవీవిరమణ చేసి ఆర్థికంగా వెనుకబడిన 42 మంది పాత్రికేయులకు నెలకు రూ.12వేలు పింఛన్ ఉత్తర్వులను ముఖ్యమంత్రి స్టాలిన్ సచివాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో పంపిణీ చేశారు. పాత్రికేయులకు నెలవారీ పింఛనుగా రూ.12వేలు పంపిణీ చేయాలని నవంబరు 27న రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఆ జీవోను అమలుపరిచే విధంగా రాష్ట్రవ్యాప్తంగా పదవీవిమరణ చేసిన పాత్రికేయులు ఈ పింఛన్ పొందేందుకు అర్హులు. డీఎంకే ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 2021 డిసెంబరు 1న ప్రభుత్వ సమాచార మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో పాత్రికేయుల సంక్షేమ బోర్డు అందుబాటులోకి వచ్చింది. దీని ద్వారా వర్కింగ్ జర్నలిస్టుల కుటుంబాలకు సంక్షేమ సహాయాలు, విద్యా ఉపకార వేతన, వివాహ ఆర్థిక సహాయం, ఉచిత వైద్యం, సహజ మరణం, అంత్యక్రియలకు ఆర్థిక సాయాన్ని 2024, మార్చి నుండి పంపిణీ చేస్తున్నారు. కాగా, పాత్రికేయుల సంక్షేమ బోర్డులో ఇప్పటివరకు 3,674 మంది సభ్యులుగా చేరగా, వీరిలో 81 మందికి రూ.8,56,500 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో సమాచారశాఖమంత్రి ఎంపి.స్వామినాథన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, తమిళ అభివృద్ధి సమాచారశాఖ కార్యదర్శి రాజారామన్, సమాచారశాఖ డైరెక్టర్ ఆర్.వైద్యనాథన్, అడిషనల్ డైరెక్టర్లు ఎస్.సెల్వరాజ్, ఆర్.భాస్కరన్ తదిరులు పాల్గొన్నారు.

చిత్రజ్యోతి

ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామాగా 'మొయ్ విరుందు'



'మొయ్ విరుందు' ఫస్ట్‌లుక్

ఎస్‌కే ఫిలిమ్స్ ఇంటర్నేషనల్ బ్యానరుపై ఎస్.కమలకన్నన్ నిర్మించే చిత్రానికి 'మొయ్ విరుం దు' అనే టైటిల్ ఖరారు చేశారు. కుటుంబంలో జరిగే అంశాలతో ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామాగా రూపుదిద్దుకునే ఈ చిత్రానికి సీఆర్ మణికంఠన్ దర్శకుడు. ఈ చిత్ర విశేషాలను దర్శకుడు వివరిస్తూ, 'తమిళనాడులోని కొన్ని గ్రామాల్లో మొయ్ విరుందు సంప్రదాయ ఆచారం. పేరావూరణి అనే గ్రామానికి వెళ్ళగా అక్కడ ఈ విందు కార్యక్రమం జరుగుతుండడం చూసి ఆశ్చర్యపోయాను. ఒక కుటుంబం మూడు సంవత్సరాలకు ఒకసారి ఈ మొయ్ విరుందు ఏర్పాటుచేస్తుంది. ఇలా చేయడం వల్ల ఆ గ్రామస్తులు కూడా ఎంతో క్రమశిక్షణతో ఉంటారని, ప్రతి ఒక్కరికీ సాయం లభిస్తుందని భావన. ఇది నాకు ఎంతగానో ఆశ్చర్యం కలిగించింది. దీన్ని ప్రధాన ఇతివృత్తంగా చేసుకుని స్క్రిప్టు సిద్ధం చేశాను. అందుకే ఈ చిత్రానికి 'మొయ్ విరుందు' అనే పేరు పెట్టాం. ప్రతి ఒక్కరికీ నచ్చేలా ఒక ఎమోషనల్ డ్రామాగా ఉంటుందన్నారు. ఈ మూవీలో అర్చన ప్రధాన పాత్ర పోషిస్తుండగా, రక్షన్, అయేషా నాయగన్, అపర్ణతి, దీపా శంకర్, సుజాత, మనస్వి కొట్టాచి, నమో నారాయణన్, గజరాజ్, తంగదురై లొలుసభా మారన్ సిక్సర్ రవి తదితరులు నటించారు. కొడైక్కెనాల్‌లోని పన్నకాడు అనే ప్రాంతంలో చిత్రీకరణ పూర్తి చేశాం. నిర్మాణాంతర కార్యక్రమాలను జరుపుకుంటుంది' అని పేర్కొన్నారు.

నటీనటులు కాదు.. కథ ముఖ్యం : కె.భాగ్యరాజ్



ఆడియో రిలీజ్ కార్యక్రమంలో కె.భాగ్యరాజ్, 'జస్టిస్ ఫర్ జెని' చిత్ర బృందం

ఏదైనా సినిమాలో ఎవరు నటించారన్నది ముఖ్యం కాదని అందులో ఉన్న కంటెంట్ ప్రధానమని సీనియర్ దర్శక నటుడు కె.భాగ్యరాజ్ అన్నారు. అస్నా క్రియేషన్స్ పతాకంపై సయ్యద్ తమీన్ నిర్మాణ సారథ్యంలో సంతోష్ రాయన్ దర్శకత్వంలో ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్ డ్రామాగా రూపొందించిన చిత్రం 'జస్టిస్ ఫర్ జెని'. ఆషికా అశోగన్ ప్రధాన పాత్ర పోషించిన ఈ చిత్రంలోని ఓ ముఖ్య పాత్రలో శాంత్రా అనిల్ నటించగా, ఇతర పాత్రల్లో ఐశ్వర్య, చినాన్, బిట్టు థామస్, రేఖ, హరీష్ పేరడి, నిళల్‌గల్ రవి తదితరులు పోషించారు. చెన్నై, కోవై, కొచ్చిన్ ప్రాంతాల్లో చిత్రీకరించిన ఈ మూవీని త్వరలోనే విడుదల చేయనున్నారు. దీన్ని పురస్కరించుకుని నగరంలో ఆడియో, ట్రైలర్ రిలీజ్ వేడుక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన దర్శక నటుడు కె.భాగ్యరాజ్ ఆడియో రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఒక చిత్రంలో ఎవరు నటించారన్నది ముఖ్యంకాదు. ఆ మూవీ కంటెంట్ కీలకం. నాకు క్రైమ్ స్టోరీలంటే అమితాసక్తి. సంతోష్‌కు ఇది తొలి సినిమా అయినప్పటికీ చాలా బాగా తెరకెక్కించారు. ఈ రోజుల్లో మీడియాలో వచ్చే రివ్యూస్ ఆధారంగానే ప్రేక్షకులు థియేటర్‌కు వెళుతున్నారు. అందువల్ల మీడియా మిత్రులు ఇలాంటి చిన్న సినిమాలకు మద్దతుగా నిలవాలని కోరారు. దర్శకుడు సంతోష్ మాట్లాడుతూ, మెడికో హత్యకు గురవుతుంది. ఆమె హత్య వెనుక కారణాలను తెలుసుకునేందుకు ఆమె స్నేహితురాలు ప్రయత్నిస్తుంది. ఈ అన్వేషణలో హత్య ఎవరు చేశారు? ఆమె నేపథ్యం, హత్యకు గల కారణాన్ని కనుగొంటుందా? ఆ రహస్యమేంటి? అనేది ఈ చిత్ర కథాంశం. వాస్తవ సంఘటనల ఆధారంగా తెరకెక్కించిన ఇన్వెస్టిగేషన్ మూవీ. అన్ని వర్గాల వారికీ నచ్చేలా వాణిజ్య అంశాలతో ఈ చిత్రాన్ని రూపొందించామన్నారు.

అర్జున్‌దాస్ కొత్త చిత్రం ప్రారంభం



కొత్త చిత్రం పూజా కార్యక్రమం

అర్జున్ దాస్, అన్నా బెన్, యోగిబాబు ప్రధాన పాత్రల్లో హరీష్ దురైరాజ్ దర్శకత్వం వహించే కొత్త చిత్రం బుధవారం పూజా కార్యక్రమంతో ప్రారంభమైంది. పవర్ హౌస్ పిక్చర్స్ పతాకంపై ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కనుంది. ఈ సినిమా విశేషాలను దర్శకుడు హరీష్ వివరిస్తూ, పూర్తి కుటుంబ వినోద చిత్రంగా అన్ని వర్గాల ప్రేక్షకులు ఆస్వాదించేలా కమర్షియల్ ఎలిమెంట్స్‌తో రూపొందించేలా ప్లాన్ చేశాం.ఈ సినిమా స్క్రిప్టు మొత్తం నలుగురి చుట్టూ తిరుగుతుంది. చెన్నై, మంగుళూరు, ముంబైలో సింగిల్ షెడ్యూల్‌లో చిత్రీకరణ చేయాలని ప్లాన్ చేశాం. టైటిల్, ఇతర వివరాలను త్వరలోనే అధికారికంగా వెల్లడిస్తామన్నారు.



ఒకే వేదికపై ప్రసిద్ధ కళాకారులు

అలరించిన 'మార్వెలెస్ మార్గాళి'

చెన్నై, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): 'మార్వెలెస్ మార్గాళి' పేరుతో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమం కళాత్మక వారసత్వానికి ఒక ప్రకాశవంతమైన జ్ఞాపకంగా నిలిచింది. నగరంలోని ఓ హోటల్లో మంగళవారం సాయంత్రం జరిగిన ఈ అద్భుతమైన కళారూపం ప్రసిద్ధ సంగీతకారులను ఒకచోట చేర్చింది. సంగీతకారులు, గాయకులు బిన్ని కృష్ణకుమార్, కృష్ణకుమార్, వందన శ్రీనివాసన్, హరీష్ శివరామకృష్ణన్, కార్తీక్, నిత్యశ్రీ మహదేవన్, పుష్పవనం కుప్పుస్వామి, డాక్టర్ అనితా పుష్పవనం కుప్పుస్వామి, శివంగి కృష్ణకుమార్, సైంధవి, స్టీఫెన్ దేవస్సీ, ఉమయల్పురం కె.శివరామన్, శంకర్ మహదేవన్, అరుణ సాయిరామ్, సుధా రఘునాథన్, నాట్యంలో ప్రసిద్ధులైన చిత్రా విశ్వేశ్వరన్, ధనంజయన్, శాంత ధనంజయన్, కూచిపూడి శైలజ, కవిత రాము, లాస్య, లావణ్య, వసంతలక్ష్మి, నటరాజ్, శ్రీనిధి, సుధారాణి రఘుపతి, ఉమా మురళీకృష్ణ, డాక్టర్ పద్మ తదితర కళాకారులు ఈ వేదికపై తమ కళాప్రదర్శన ఇచ్చి ఆహూతులను అలరించారు.

టీఎన్‌పీఎస్సీ ద్వారా 476 మందికి ఉద్యోగాలు

● నియామకపత్రాలు అందజేసిన సీఎం ఎంకే స్టాలిన్

పెరంబూర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తమిళనాడు ప్రభుత్వ ఉద్యోగుల ఎంపిక కమిషన్ (టీఎన్‌పీఎస్సీ) ద్వారా 376 మంది సర్వేయర్లు, వంద మంది డ్రాఫ్ట్‌మెన్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ముఖ్యమంత్రి స్టాలిన్ ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారు. ఈ మేరకు సచివాలయం విడుదల చేసిన ప్రకటనలో వివరాలిలా ఉన్నాయి... సచివాలయంలో రెవెన్యూ, విపత్తుల నిర్వహణ శాఖ ఆధ్వర్యంలో ల్యాండ్ సర్వే రికార్డ్ విభాగంలో టీఎన్‌పీఎస్సీ ద్వారా సర్వేయర్లు, డ్రాఫ్ట్ మెన్స్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల్లో 10 మందికి ముఖ్యమంత్రి స్టాలిన్ ఉద్యోగ నియామక పత్రాలు అందజేశారని తెలిపింది. కార్యక్రమంలో మంత్రి కేకేఎస్ఎస్ఆర్ రామచంద్రన్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎన్.మురుగానందం, అధికారులు పాల్గొన్నారని సచివాలయం తెలిపింది.



అభ్యర్థులకు నియామక పత్రాలు అందజేస్తున్న సీఎం స్టాలిన్



భేరివారిమండపం.. ముత్యాలమ్మ



జయరామరావువీధి.. కావమ్మ



పెండ్లిమండపం.. పొన్నాలమ్మ



గాంధీవీధి.. అంకమ్మ



కొత్తపేట.. భువనేశ్వరి





బ్రాహ్మణవీధి.. నల్లగంగమ్మ



సన్నిధివీధి.. అంకాలమ్మ

కొలువుదీరిన ఏడు గంగమ్మలు

- రాత్రి ఘనంగా నిమజ్జనం
- రోజంతా మొక్కులు చెల్లించుకున్న భక్తులు

శ్రీకాళహస్తికే ప్రత్యేకమైన ఏడు గంగమ్మల జాతర బుధవారం ఘనంగా జరిగింది. అమ్మవారి నామస్మరణతో పట్టణం మార్మోగింది. అమ్మవార్లు కొలువుదీరే ఏడు ప్రాంతాల్లో మూడు రోజుల ముందు నుంచే చలువ పందిళ్లు, విద్యుద్దీపాలతో అలంకరించారు. ఏడు ప్రాంతాల్లో అమ్మవారి ఉత్సవమూర్తులు మంగళవారం అర్ధరాత్రిపైన విశేష అలంకారంలో ఊరేగింపునకు సిద్ధం చేశారు. బుధవారం వేకువజామున మూడు గంటల ప్రాంతంలో ఏడుగంగమ్మలు వరుసగా శ్రీకాళహస్తి న్యాయస్థాన భవనం సమీపంలోని ఏడుగంగమ్మల ఆలయం వద్దకు చేరుకున్నాయి. కుంభం, ప్రత్యేక పూజల తర్వాత అమ్మవార్ల ముసుగు తొలగించి భక్తులకు దర్శనం కల్పించారు. మంగళవాయిద్యాలు, బ్యాండు మేళాలు, సాంస్కృతిక కళాబృందాల ప్రదర్శనలు, యువత చిందుల నడుమ ఏడుగురు అమ్మవార్లు ఒకరి వెనుక ఒకరు.. వరుసగా సాగారు. పలువురు అమ్మవార్లకు కుంభం, కోడిపుంజులు, వేటలు సమర్పించారు. పెండ్లిమండపం నుంచి ఎక్కడి ప్రాంతాల అమ్మవార్లు అక్కడకు వెళ్లి కొలువుదీరారు. పట్టణమంతా ఏడుగంగమ్మలు కొలువుదీరిన ప్రాంతాల్లో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. ఎటు చూసినా భక్తజన సందడే కనిపించింది. పట్టణంలో ట్రాఫిక్‌ను మళ్లించారు. ఇక, పలువురు భక్తులు అమ్మవారికి అంబళ్లు పోశారు.

కన్నులపండువగా నిమజ్జనం

బుధవారం రాత్రి ఏడుగంగమ్మలు ఆయా ప్రాంతాల నుంచి తిరిగి ఊరేగింపుగా సాగారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నిర్వహిస్తున్న ముత్యాలమ్మ ఆలయం వద్దకు చేరుకున్నారు. ఆనవాయితీ ప్రకారం అక్కడ ఒక్కో అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం నిమజ్జనం నిర్వహించారు.

- శ్రీకాళహస్తి, ఆంధ్రజ్యోతి

సర్వదర్శనానికి 10 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 10 గంటల సమయం పడుతోంది. బుధవారం సాయంత్రం 4 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

సోమవారం హుండీ ఆదాయం: రూ.3.96 కోట్లు
మంగళవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 70,901
తలనీలాలు సమర్పించినవారు: 23,128

తిరుమలలో నటి శ్రియ



సినీనటి శ్రియ బుధవారం వేకువజామున తిరుమల శ్రీవారి సుప్రభాతసేవలో పాల్గొన్నారు. తన కుమార్తె రాధా కోస్చీవ్, తల్లి నీరజతో కలిసి ఆమె శ్రీవారి దర్శనం చేసుకున్నారు. ఇంకా కర్ణాటక మాజీ మంత్రి కెఎస్ ఈశ్వరప్ప, ఐపీఎస్ అధికారి విశాల్ గున్నీ కూడా బుధవారం దర్శనం చేసుకున్న వారిలో ఉన్నారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి

శ్రీవారికి విరాళంగా రెండు కార్లు



తిరుమల, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి బుధవారం రెండు కార్లు విరాళంగా అందాయి. తిరుపతికి చెందిన లోటస్ ఎలక్ట్రిక్ ఆటో వరల్డ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ నుంచి అర్జున్ కొల్లికొండ అను భక్తుడు రూ.10 లక్షల విలువైన సిట్రాయెన్(ఈసీ3) ఎలక్ట్రిక్ కారును అందజేశారు. అలాగే చెన్నైకు చెందిన శరవనన్ కరుణాకరన్ అనే భక్తుడు రూ.9 లక్షల విలువైన సిట్రాయెన్ (బసాల్ట్ ఎక్స్ ప్లస్ యాంటీ) కారును విరాళంగా ఇచ్చారు. శ్రీవారి ఆలయం ముందు కార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి తాళాలను శ్రీవారి ఆలయ పేష్కార్ రామకృష్ణకు అందజేశారు.

ఫిర్యాదుల్లో రెవెన్యూ సమస్యలే అధికం



తిరుపతి(కలెక్టరేట్), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదుల్లో అత్యధికంగా రెవెన్యూ సమస్యలపైనే ఉంటున్నాయని, వాటి పరిష్కారానికి భరోసా కల్పించాలంటూ రెవెన్యూ అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్ వేదికగా బుధవారం జిల్లాలోని అన్ని విభాగాల రెవెన్యూ, ల్యాండ్ అండ్ సర్వే అధికారులతో ఆయన సమీక్షించారు. 'రెవెన్యూ అధికారులంటేనే సమస్యల పరిష్కారంలో కాలయాపన చేస్తారని అపవాదు ఉంది. దీనిని తొలగించాలంటే ప్రజలు ఇచ్చే ఫిర్యాదులపై తక్షణం స్పందించాలి. వాటి పరిష్కారానికి కృషి చేయాలి. అప్పుడే వారికి మనపై, ప్రభుత్వంపై నమ్మకం కలుగుతుంది. కొంతమంది తహసీల్దార్లు, సర్వేయర్ల వ్యవహార శైలిపై ఫిర్యాదులు వస్తున్నాయి. ఇకనైనా వారు పద్ధతి మార్చుకోకుంటే కఠినమైన చర్యలు తీసుకుంటాం. సకాలంలో కుల ధ్రువీకరణ పత్రాలు అందించాలి' అని కలెక్టర్ సూచించారు. రీసర్వే, 22ఏ, అసైన్‌మెంట్ ల్యాండ్స్, ఇనాం భూములు, పొజిషన్ సర్టిఫికెట్లు.. ఇలా పలు అంశాలపై కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు దేవేంద్రరెడ్డి, రోజ్మాండ్, ఆర్డీవోలు రామ్మోహన్, భానుప్రకాష్‌రెడ్డి, కిరణ్మయి, జిల్లా ల్యాండ్ అండ్ సర్వే అధికారులు అరుణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుపై బైఠాయించి నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘాల నాయకులు

నెల్లూరులో కలపాలంటూ గూడూరులో విద్యాసంస్థల బంద్

గూడూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గాన్ని నెల్లూరు జిల్లాలో కలపాలంటూ బుధవారం విద్యార్థి, యువజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో విద్యాసంస్థల బంద్ చేపట్టారు. సాధుపేటసెంటర్ వద్ద రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి, యువజన సంఘాల జేఏసీ నాయకులు మాట్లాడుతూ గూడూరును తిరుపతి జిల్లాలో కలపడం వల్ల జిల్లా కేంద్రంలోని కార్యాలయాలకు వెళ్లాలంటే ప్రజలు, ఉద్యోగులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. ఎన్నికల సమయంలో చంద్రబాబునాయుడు, యువగళం పాద్రయాత్రలో నారా లోకేశ్ ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో మనోజ్‌కుమార్, శశికుమార్, సునీల్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు. ఇక, టవర్‌క్లాక్ వద్ద జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన రిలే దీక్షలు నాలుగో రోజూ కొనసాగాయి.

- శ్రీసిటీలో 'పేక్స్ ఇండియా'

నీటి నాణ్యత టెస్టింగ్ ల్యాబ్ ప్రారంభం



ల్యాబ్ ప్రారంభోత్సవం సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతున్న శ్రీసిటీ ఎండీ

సత్యవేడు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీలోని పల్ప్ అండ్ పేపర్, ఫుడ్ అండ్ బెవరేజెస్, పెట్రో కెమికల్ రంగాలకు అధునాతన రియాక్టర్ భాగాలను తయారు చేస్తున్న పేక్స్ ఎన్విరాన్‌మెంటల్ టెక్నాలజీ ఇండియా ప్రైవేటు లిమిటెడ్(పీఈటీఐ)సంస్థ తమ ఆవరణలో ఏర్పాటు చేసిన అత్యాధునిక నీటి, మురుగునీటి నాణ్యత టెస్టింగ్ ల్యాబ్‌ని బుధవారం ప్రారంభించింది. ఈ సందర్భంగా శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ.. శ్రీసిటీని క్లీన్ అండ్ గ్రీన్ పారిశ్రామిక కేంద్రంగా తీర్చిదిద్దే సంకల్పానికి ఇది మరో మైలురాయిగా అభివర్ణించారు. దీని ద్వారా పరిశ్రమలకు వేగవంతమైన, కచ్చితమైన, విశ్వసనీయ నీటి పరీక్ష సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. పేక్స్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ సుదీప్ సంగమేశ్వరన్ మాట్లాడుతూ, ఈ కొత్త ల్యాబ్ మేక్ ఇన్ ఇండియా ఆలోచనకు అనుగుణంగా అత్యాధునిక టెస్టింగ్ సేవలను అందిస్తుందన్నారు. శ్రీసిటీ పరిశ్రమలు, ఇతర సంస్థలు ఈ సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ ల్యాబ్ గురించి ఆ సంస్థ వైస్ ప్రెసిడెంట్ (మాన్యుఫ్యాక్చరింగ్, అప్లికేషన్) గణేష్ చిదంబరం ల్యాబ్ గురించి వివరించారు. యూరోపియన్ ప్రమాణాలతో అభివృద్ధి చేసిన ల్యాబ్‌లో 30కిపైగా అంశాలలో నీరు, మురుగునీరుకు సంబంధించిన సర్టిఫైడ్ టెస్టింగ్ అందుబాటులో ఉందని తెలిపారు. ముఖ్యంగా ప్రత్యేక బయోకెమికల్ మీథేన్ పొటెన్షియల్(బీఎంపీ)టెస్టింగ్ ద్వారా పరిశ్రమలు బయోగ్యాస్ రికవరీ సామర్థ్యాన్ని పెంచుకోవచ్చన్నారు.

తిరుపతి నుంచి ఇండిగో విమానాలన్నీ నడుస్తున్నాయి

- ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ భూమినాథన్



వివరాలు వెల్లడిస్తున్న తిరుపతి ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ భూమినాథన్

రేణిగుంట, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుపతి విమానాశ్రయం నుంచి ఇండిగో విమానాల రాకపోకలు పూర్తి స్థాయిలో పునరుద్ధరించినట్లు తిరుపతి ఎయిర్‌పోర్ట్ డైరెక్టర్ డి.భూమినాథన్ తెలిపారు. డిసెంబరు 7వ తేదీ నుంచి విమానాశ్రయ కార్యకలాపాలు పూర్తిగా సాధారణ స్థితికి వచ్చినట్లు తెలిపారు. ప్రస్తుతం ఇండిగోకు చెందిన అన్ని విమానాలూ తిరుపతి నుంచి షెడ్యూల్ ప్రకారం నడుస్తున్నాయన్నారు. తిరుపతి విమానాశ్రయంలో బుధవారం ఆయన మీడియా సమావేశంలో ఈ వివరాలు వెల్లడించారు. 5, 6 తేదీల్లో మాత్రం ఇండిగో విమానాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడిందన్నారు. డిసెంబరు 5న తిరుపతి విమానాశ్రయానికి రాకపోకలు సాగించాల్సిన 24 విమానాల్లో 18 రద్దుకాగా 6 విమానాలు ఆలస్యంగా నడిచాయన్నారు. అలాగే డిసెంబరు 6న 2 విమానాలు రద్దుకాగా 10 విమానాలు ఆలస్యంగా నడిచాయని వివరించారు. ఈ అంతరాయం కేవలం ఇండిగో విమానాలకు మాత్రమే పరిమితమైందని, ఇతర విమానయాన సంస్థల కార్యకలాపాలు సాధారణంగానే కొనసాగాయని చెప్పారు. అయితే ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) తిరుపతి విమానాశ్రయం, ఇండిగో ఎయిర్‌లైన్స్ సంయుక్త కార్యాచరణ ప్రణాళికతో పూర్తిస్థాయిలో సహాయక చర్యలు చేపట్టినట్లు భూమినాథన్ తెలిపారు. ప్రయాణికులకు ఆహారం, తాగునీరు, వసతి, విమాన చార్జీల పూర్తి రీఫండ్, క్యాబ్ సౌకర్యం, ప్రత్యామ్నాయ ప్రయాణ ఏర్పాట్లు కల్పించినట్లు వివరించారు. ఈ మీడియా సమావేశంలో డీజీసీఏ డైరెక్టర్ దొరైరాజ్, సీఐఎస్ఎఫ్ కమాండెంట్ అనురాగ్‌యాదవ్ పాల్గొన్నారు.

- ఎస్వీయూ బీటెక్ సెకెండ్ సెమిస్టర్

ఫలితాలు ఎప్పుడు?

మూడు నెలలైనా వెల్లడికాని వైనం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీలో బీటెక్ రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలు ప్రకటించకపోవడం పట్ల విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీటెక్ కోర్సు మొదటి సంవత్సరానికి సంబంధించిన రెండవ సెమిస్టర్ పరీక్షలు ఆగస్టులో నిర్వహించారు. వివిధ బ్రాంచ్‌లకు సంబంధించిన సుమారు 430 మంది విద్యార్థులు హాజరైనట్టు తెలుస్తోంది. పరీక్షలు పూర్తయి మూడు నెలలకు పైగా గడిచినా ఇంతవరకూ ఫలితాలు విడుదల చేయలేదు. ఇతర కాలేజీల్లో ఫలితాలు ప్రకటించేశారని ఇక్కడ మాత్రం ఎందుకు జాప్యం చేస్తున్నారని అంటున్నారు. కాగా ఆన్‌లైన్ ద్వారా జవాబు పత్రాల మూల్యాంకనం చేయడంతో ఆలస్యమవుతున్నట్టు సమాచారం. బీటెక్ నాలుగు, మూడవ సంవత్సరాలకు సంబంధించిన ఫలితాల విడుదలపై అధికార యంత్రాంగం ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ ఉంది. ఎందుకంటే, బీటెక్ నాలుగు, మూడు సంవత్సరాలకు చెందిన విద్యార్థులు ఇతర ఉన్నత విద్య, ఉద్యోగావకాశాల కోసం యూనివర్సిటీ వెలుపలకు వెళ్ళే అవకాశం ఉండడంతో నాలుగు, మూడో సంవత్సరం ఫలితాలను ముందుగా ఇస్తారని, ప్రాధాన్య క్రమంలో మిగతావి ఆలస్యం అవుతాయని అంటున్నారు. త్వరలోనే బీటెక్ సెకెండ్ సెమిస్టర్ ఫలితాలు ప్రకటిస్తామని యూనివర్శిటీ వర్గాలు చెబుతున్నాయి.

జనగణమన జాతీయ గీతం అయ్యింది గాంధీ వల్లే

- నెహ్రూపై ఆరోపణలు అన్యాయం: చింతా మోహన్

తిరుపతి(ఎంఆర్‌పల్లె), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): 'జనగణమన జాతీయ గీతంగా మారింది మహాత్మా గాంధీ సూచనతోనే. చరిత్ర తెలియని మోదీ ఏదేదో మాట్లాడుతున్నారు' అని కేంద్ర మాజీ మంత్రి చింతా మోహన్ విమర్శించారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, '1911లో కోల్‌కత్తాలో జరిగిన కాంగ్రెస్ సదస్సులో రవీంద్రనాథ్‌ఠాగూర్ జనగణమన బెంగాలీ గీతాన్ని ఆలపించారు. అది విన్న గాంధీ, ఠాగూర్‌ను మదనపల్లెకు వెళ్లి అనిబిసెంట్‌ను కలవమని చెప్పారు. అలా ఆయన మదనపల్లెలో ఆ గీతాన్ని ఇంగ్లీషులోకి అనువదించారు. అక్కడే బాణీ సమకూర్చారు' అని ఆయన వివరించారు. ఇది తెలియని మోదీ నెహ్రూ మరణించి 60 ఏళ్లు అవుతుంటే, ఇప్పుడు ఆరోపణలు చేయడం అర్థరహితమన్నారు. ప్రజలను తప్పుదారి పట్టించడం తగదని చింతా మోహన్ అన్నారు. టీటీడీ ప్రతిష్ఠ పెంచింది స్థానికులు, కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. అలాంటి టీటీడీ నేడు స్థానికులను చిన్నచూపు చూస్తోందన్నారు. ఇక బీజేపీ, టీడీపీకి బ్రేక్ దర్శనాల్లో కోటా ఇస్తున్నారంటూ తప్పుపట్టారు. 2004లో కాంగ్రెస్ చరిష్మాతో రాష్ట్రంలో గెలిచిందని, వైఎస్ రాజశేఖర్‌రెడ్డి వల్ల కాదన్నారు. కాంగ్రెస్ పార్టీ వల్ల పైకి వచ్చిన కుటుంబాల బిడ్డలు పార్టీకి నష్టం చేశారన్నారు. కాంగ్రెస్‌కు పూర్వవైభవం వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు యార్లపల్లి గోపిగౌడ్, రవి, తేజోవతి, శాంతియాదవ్, మునిశోభ, వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

'టెట్'కు 92 మంది గైర్హాజరు

తిరుపతి(విద్య), డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): జిల్లాలో బుధవారం జరిగిన టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)కు 92 మంది గైర్హాజరైనట్లు డీఈవో కుమార్ తెలిపారు. ఉదయం 7 కేంద్రాల్లో పరీక్షకు 714 మందికి 659 మంది.. మధ్యాహ్నం 3 పరీక్ష కేంద్రాల్లో 297కి 260 మంది పరీక్షలు రాశారన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు నిర్వహించామని, బయోమెట్రిక్ హాజరు నమోదు చేశామని చెప్పారు.

ఇద్దరు అసిస్టెంట్ ప్రొఫెసర్లకు రిమాండ్

తిరుపతి (నేరవిభాగం), డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని జాతీయ సంస్కృత వర్సిటీలో లైంగిక వేధింపుల కేసులో అరెస్టయిన అసిస్టెంట్ ప్రొఫెసర్లు లక్ష్మణ్ కుమార్, శేఖర్‌రెడ్డికి బుధవారం రుయాస్పత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం న్యాయమూర్తి ఎదుట పోలీసులు హాజరుపరచగా వారిని విచారించి ఈ నెల 23వ తేది వరకు రిమాండ్ విధిస్తూ తీర్పునిచ్చారు.



మంటలు చెలరేగిన కారు



పూర్తిగా దగ్ధమైన కారు

బయోట్రిమ్‌లో కారు దగ్ధం

మంగళం, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరం కరకంబాడిరోడ్డులోని బయోట్రిమ్‌లో బుధవారం పార్కింగ్ చేసి ఉన్న ఇన్నోవా కారు (కేఈ03 ఏఎం3699) ఇంజన్‌లో షార్ట్‌సర్క్యూట్ కారణంగా దగ్ధమైంది. బయోట్రిమ్‌లో హార్టికల్చర్ సెమినార్‌కు వరదయ్యపాళెం నుంచి కొందరు రైతులువచ్చారు. వారి కారును పార్కు చేసి సెమినార్‌లో పాల్గొన్నారు. ఉదయం 11.30గంటలకు కారులో షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగాయి. బయోట్రిమ్ సిబ్బంది మంటలను ఆర్పడానికి ప్రయత్నించినా వీలు కాకపోవడంతో ఫైర్ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. దాదాపు గంట పాటు శ్రమించి ఫైర్ సిబ్బంది మంటలను ఆర్పేశారు. అప్పటికే కారు కాలిపోయింది. అలిపిరి పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

అమ్మవారి ఆలయంలో వైద్యురాలి పట్ల అనుచిత ప్రవర్తన

- దేహశుద్ధి చేసిన భక్తులు

తిరుచానూరు, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి): తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి దర్శనానికి బుధవారం సాయంత్రం బెంగళూరుకు చెందిన ఓ యువ వైద్యురాలు కుటుంబసభ్యులతో కలిసి వచ్చారు. ఆలయం లోపల క్యూలైనులో వెళ్తుండగా తెలంగాణ రాష్ట్రం ఖమ్మంకు చెందిన రమేష్.. ఆ వైద్యురాలిపై చేయివేసి అనుచితంగా ప్రవర్తించాడు. ఆమె కేకలు వేయడంతో భక్తులు రమేష్‌ను క్యూలైను నుంచి వెలుపలకు లాక్కొచ్చి చితకబాదారు. అతడిని ఆలయ అధికారులు తిరుచానూరు పోలీసులకు అప్పగించారు. గతంలోనూ ఇతడు ఇదే తరహాలో ప్రవర్తించినట్లు పోలీసుల విచారణలో తేలినట్లు సమాచారం. ఇలాంటి ఘటనలు చోటు చేసుకోకుండా విజిలెన్సు అధికారులు క్యూలైన్లలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాల్సి ఉంది.